
Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03 నెల్లూరు, 18.11.2016, శుక్రవారం సంపుటి : 36 సంచిక : 24 పేజీలు : 12, వెల : ₹ 5





# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com


## పెద్ద నోట్ల రద్దుతో...



# పేదలకు కష్టం... పెద్దలకు నష్టం

- కొనసాగుతున్న చిల్లర సమస్య
- అట్టుడికిపోతున్న ప్రతిపక్షాలు
- దేశమంతా జనజీవనం అస్తవ్యస్థం
- రద్దుపై వెనక్కి తగ్గని మోడీ
- నల్లకుబేరుల చుట్టూ బిగుస్తున్న ఉచ్చు
- బీజేపీ నేతలకు మింగుడుపడని మోడీ వైఖరి
- త్వరలో బినామీల భరతం

**దేశ స్వాతంత్ర్యం కోసం జరిగిన సంగ్రామంలోనూ పూర్తి జనం రోడ్ల మీదకు రాలేదు. స్వతంత్ర చరిత్రలో ఇంతవరకు జరిగిన ఏ ఎన్నికల్లో కూడా పూర్తి స్థాయిలో జనం బయటకొచ్చి ఓటు వేయలేదు. దేశంలో ఎమర్జెన్సీ విధించిన సమయంలోనూ నిరసనలు తెలపడానికి నూరు శాతం జనాభా రోడ్డెక్కలేదు. దేశ చరిత్రలో ఏ సంఘటనలోనూ దేశ జనమంతా రోడ్లెక్కిన దాఖలాలు లేవు. కాని దేశ చరిత్రలోనే తొలిసారిగా... నూటపాతిక కోట్లమందిని రోడ్డు ఎక్కించి క్యూలో నిలబెట్టిన ఘనత ప్రధానిగా నరేంద్రమోడీకి దక్కుతుంది.**

పెద్ద నోట్ల రద్దు... ప్రస్తుతం దేశంలో పెను సంచలనం. ప్రతిచోటా దీనిమీదే చర్చ. పార్లమెంటులో దీనిపైనే ప్రకంపనలు. పెద్దనోట్లను రద్దు చేసి సామాన్యులను ఇబ్బంది పెడుతున్నారంటూ ప్రతిపక్షాల మెరుపుదాడి... మీరు పోగేసుకున్న వేలకోట్ల ధనాన్ని కాపాడుకోవడానికే పెద్దనోట్ల రద్దును వ్యతిరేకిస్తున్నారంటూ బీజేపీ ఎదురు దాడి... మొత్తానికి దేశంలో (మిగతా 11వ పేజీలో)



## జనం తప్ప 'సేనే' లేని.. 'జనసేన'

# ఒకే ఒక్కడు

3లో

అంతుచిక్కని 'పవన్ పంథా'



# దత్తపుత్రుడొచ్చాడు!

12లో

## జంపింగ్‌లకు

# బ్రేకింగ్ న్యూస్

## వలస నేతలపై వేటు తప్పదా?

**అధికారం కోసం, సంపాదన కోసం ఒంటి మీద చొక్కాలను మార్చినంత సులభంగా పార్టీలను మార్చే నాయకులకు ఇదొక షాకింగ్ న్యూసే!**

రాష్ట్రంలో ప్రతిపక్ష వైకాపా నుండి తెలుగుదేశంలోకి దూరిన 20మంది ఎమ్మెల్యేలకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై చర్య తీసుకోవాలంటూ ప్రతిపక్షం ఎన్నిసార్లు విన్నవించుకున్నా స్పీకర్ వినిపించుకోలేదు. వినిపించుకోడు కూడా! ఎందుకంటే ఆయన కూడా అధికార పార్టీయే కదా! ఈ నేపథ్యంలో జంపింగ్ ఎమ్మెల్యేలపై బహిష్కరణ వేటు వేయాలంటూ ఉరవకొండ ఎమ్మెల్యే హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. దీనిని విచారించిన హైకోర్టు పార్టీ మారిన 20మంది ఎమ్మెల్యేలకూ నోటీసులు జారీ చేసింది. ఇది ఒకరకంగా ఎమ్మెల్యేలకు షాకే! అయితే కేసు విచారణ త్వరగా పూర్తై హైకోర్టు ఫిరాయింపుల నిరోధక చట్టం క్రింద వేటు వేస్తే జంపింగ్ జిలానీలకు గుణపాఠం (మిగతా 11వ పేజీలో)






# భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి

కార్తీక మాసానికే మకుటాయమానం కార్తీక పౌర్ణమి. కార్తీక పౌర్ణమి నాడు శివుడు త్రిపురాసురులను సంహరించాడు. అందువల్ల దీనిని త్రిపుర పౌర్ణమిగా కూడా పిలుస్తుంటారు. శివుడు ఏక బాణంతో త్రిపురాసురులను వధించిన తిథి అయినందున శివునికి తామరపువ్వులతో పూజలు నిర్వహిస్తారు.

సోమవారం కార్తీకపౌర్ణమి కావడంతో నగర వాసులు భక్తిశ్రద్ధలతో పూజలు జరుపుకున్నారు. నెల్లూరు మూలాపేటలోని శ్రీ భువనేశ్వరి సమేత శ్రీ మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీ స్వామివారికి విశేషపూజలు, అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయంలో నిర్వహించిన కార్తీకదీపం, చంద్రదర్శనం ఉభయకర్తగా నూనె మల్లిఖార్జున యాదవ్, ప్రాకారోత్సవం ఉభయకర్తగా కొండ్రెడ్డి రంగారెడ్డి వ్యవహరించారు. కార్యక్రమాలను పాలకమండలి ఛైర్మెన్ ఆల్తూరు గిరీష్‌రెడ్డి, ఇఓ పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి, పాలకమండలి సభ్యులు పర్యవేక్షించారు. సాయంత్రం జరిగిన కార్యక్రమంలో సంప్రదాయబద్ధంగా బాండలిలోని తైలంలో పౌర్ణమి చంద్రుడిని వీక్షించారు. ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, నగర మేయర్ అబ్దుల్ అజీజ్, మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలోని శ్రీ మీనాక్షి సుందరేశ్వరస్వామి వారి ఆలయంలో స్వామివారికి ఆలయ ప్రధానార్చకులు తంగిరాల రాధాకృష్ణ శర్మ ఆధ్వర్యంలో విశేషపూజలు నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి మెంటా రామమోహన్‌రావు పర్యవేక్షణలో పూజలు జరిగాయి. స్టోన్‌హౌస్‌పేటలోని శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో మూలవర్లకు ఆలయ అర్చకులు శివయ్యస్వామి ఆధ్వర్యంలో విశేషపూజలు జరిగాయి. పుట్టమట్టితో చేసిన 1008 మృత్తిక శివలింగాలకు మహిళలు తులసి, బిల్వదళాలతో అభిషేకించారు. ఆలయ ఛైర్మెన్ మునగా వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు. నవాబుపేటలోని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి ఆలయంలో విశేషపూజలు, అభిషేకాలు, ఆకాశదీపాలంకరణలు జరిగాయి. పాలకమండలి ఛైర్మెన్ బాలకిషోర్‌నాయుడు, ఇఓ నవీన్‌కుమార్ పర్యవేక్షించారు. రంగనాయకులపేటలోని శ్రీ తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలోని స్వామివారి గర్భాలయంలో శాస్త్రోక్తంగా అన్నకూటం నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు కిడాంబి జగన్నాథాచార్యులు ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. పాలకమండలి ఛైర్మెన్ మంచికంటి సుధాకర్‌రావు, ఇఓ పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు. సాయంత్రం పెన్నానదికి హారతులు పట్టారు.

ఇస్కాన్ మందిరంలో తులసి మహారాణి, దామోదర్ మహారాజ్‌ల వివాహ మహోత్సవం వేడుకగా జరిగింది. మందిర అధ్యక్షుడు డాక్టర్ సుఖదేవస్వామి పర్యవేక్షించారు.

సింహపురి సమాచారం

## 27న అభినయ ఆర్ట్స్ పంచమ వార్షికోత్సవం

నెల్లూరులోని అభినయ ఆర్ట్స్ పంచమ వార్షికోత్సవాన్ని ఈ నెల 27వ తేదీ ఆదివారం నెల్లూరు టౌన్‌హాల్లో నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షులు సి.ఆర్.రాఘవ తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 9గంటల నుండి సినీ, లలిత, సంగీతం, పాటల పోటీలు, సినీ శాస్త్రీయ నృత్యపోటీలు, ఏకపాత్రాభినయ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం 5గంటలకు జరిగే కార్యక్రమంలో 'శృతిలయ' నాటికను, అనంతరం గోవాడ విశాఖపట్నం వారి 'పంపకాలు' నాటికను ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు నగర ప్రముఖులచే బహుమతి ప్రదానం చేస్తారు. ప్రముఖనటులు గోపరాజు రమణకు ఘనసత్కారం జరుగుతుందని, ముఖ్యఅతిథులుగా నగర ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు.

# 'పుస్తకం'పై ఆకట్టుకున్న కవి సమ్మేళనం




నెల్లూరులోని పెన్నా రచయితల సంఘం (పెరసం) ఆధ్వర్యంలో ఈ నెల 13న 'పుస్తకం' అనే అంశంపై జరిగిన కవి సమ్మేళనం అందరినీ బాగా ఆకట్టుకుంది. నగరంలో ఇటీవల నవ్యాంధ్ర పుస్తక సంబరాలు జరిగిన నేపథ్యంలో పెరసం ఈ కార్యక్రమం నిర్వహించింది. జెవివి కార్యాలయంలో జరిగిన ఈ కవిసమ్మేళనంలో పలువురు కవులు, కవయిత్రులు పాల్గొని తమ కవితలను చదివి వినిపించారు. 'పుస్తకం లోని పేజీలను చేతివేళ్లతో తిప్పుతుంటే..కాళ్ళు ప్రపంచాన్ని చుట్టివచ్చినట్లనిపిస్తుంది'..అంటూ కవి కారుమంచి నాగేంద్ర కవిత అందరి కరతాళధ్వనులందుకుంది. అదేవిధంగా, పెరసం ప్రధాన కార్యదర్శి ఇంద్రగంటి మధుసూదనరావు 'కలం పాళీ తనపై అభిషేకిస్తున్న అక్షరరత్నాలను అపురూపంగా దాచుకునేది పుస్తకం'..అని, ప్రముఖ కవి మోపూరు పెంచలనరసింహం 'పుస్తక పఠనం కలిగించును పురోగమనం..అజ్ఞాన తిమిరం పఠించును పలాయనమంత్రం'..అని పుస్తక వైశిష్ట్యాన్ని వివరించారు. అవ్వారు శ్రీధరబాబు తన కవితలో 'నిన్ను కలుసుకున్నపుడల్లా మనసు ముద్దమందారమై వికసిస్తుంద'న్నారు. పుస్తకం ప్రాశస్త్యానికి కవితలు కట్టిన ఈ కవిసమ్మేళనంలో తోట సులోచన, అల్లాడి వేణుగోపాల్, మస్తానయ్య, శేఖర్, విష్ణుకుమార్ తదితర కవులు పాల్గొని తమ కవితలు వినిపించారు. కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులందరికీ పుస్తకాలను బహుమతులుగా అందజేశారు.

# అభాగ్యులకు ఆపన్నహస్తం 'మాకాని'


మాకాని వెంకట్రావ్

కన్న తల్లిదండ్రులే అనాథాశ్రమానికి పంపిస్తున్న ఈ రోజుల్లో... భిక్షమెత్తుకునేవారు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్ల రోడ్డు ప్రక్కన ఆదరణ కోసం నోచుకోక తిండికి, గుడ్డకు అలమటిస్తున్న ఎంతోమంది అభాగ్యులకు నేను సైతం అంటూ వయోవృద్ధుడు మాకాని వెంకట్రావు(82) అన్ని విధాలుగా సేవలందిస్తున్నారు. ఇందులో భాగంగా ప్రతిఏటా నవంబర్ 16వ తేదీన చలికాలం పేదలకు దుప్పట్లు పంపిణీ కార్యక్రమాన్ని దాదాపు 20సంవత్సరాలుగా నిర్విఘ్నంగా నిర్వహిస్తున్నాడు. నెల్లూరు మూలాపేట బ్రాహ్మణవీధికి చెందిన మాకాని వెంకట్రావు 1974లో గురు నిలయం ఆశ్రమాన్ని నెలకొల్పాడు. భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి శిష్యుడిగా ఆయనకు సేవలు చేసి, వెంకయ్య స్వామి మరణానంతరం తన స్వగృహంలో భగవాన్ వెంకయ్య స్వామి గుడిని ఏర్పాటు చేసి ఆయన విగ్రహాన్ని నెలకొల్పాడు. అప్పటినుండి ఈ ఆశ్రమంలో నిత్యహోమ పూజలు, స్వామివారికి అభిషేకాలు, ప్రతి శనివారం పేదలకు అన్నదానం, పల్లకిసేవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాడు. అందులో భాగంగానే బుధవారం దుప్పట్ల పండుగను నిర్వహించి పేదలకు, అభాగ్యులకు దుప్పట్లు పంపిణీ చేసి అన్నదానం నిర్వహించారు. అంతేకాకుండా ప్రతి శనివారం అనాధ, వృద్ధుల ఆశ్రమాలకు భోజనాల పంపిణీ, అనారోగ్యంతో వచ్చే అభాగ్యులకు మందులు ఇవ్వడం వంటి ఎన్నో సేవా కార్యక్రమాలు గురు నిలయంలో జరుగుతుంటాయి. నెల్లూరులో ప్రత్యేకంగా ఒక పండుగ వాతావరణంలో దుప్పట్లు పంపిణీ చేయడం గొప్ప విషయం. పేదల కోసం దాతల సహాయ సహకారాలతో ఈ మహాయజ్ఞాన్ని నిర్విరామంగా నిర్వహిస్తున్నారు శ్రీవారి పాదరేణువు మాకాని వెంకట్రావు.

# జిఎస్‌టిని 'కాలమే' నిర్ణయించాలి

జిఎస్‌టిపై పరిశీలన-6



చిన్ని శ్రావణ్‌కుమార్
చార్టర్డ్ అకౌంటెంట్
e-mail:
chinnisravankumar@gmail.com

వస్తు సేవా పన్ను చట్టం ప్రకారం సరఫరాపై పన్ను వేయడం జరుగుతుంది. పన్ను ఎప్పుడు కట్టాలి అనేది సరఫరా జరిగిన ప్రదేశం, సమయంపై ఆధారపడివుంటుంది.

సరఫరా ఎప్పుడు జరిగింది అనేది ఎటువంటి సరఫరా చేశాం అనేదానిపై ఆధారపడి వుంటుంది.

ఉదా : వస్తు సరఫరా అయితే భౌతికమయినది కనుక అవి చేరవేయడంపై ఆధారపడివుంటుంది. సేవలు భౌతికమైనవి కావు కనుక అవి నిర్వహణపై ఆధారపడివుంటాయి.

సరఫరా ఎప్పుడు జరిగింది అనేదానికి జిఎస్‌టిలో కొన్ని నిబంధనలను సూచించడం జరిగింది. అయితే, కొన్ని పరిస్థితుల్లో నిర్దిష్ట సమయంలో సరఫరా జరిగింది అని చెప్పడం జరుగుతుంది. అటువంటి పరిస్థితుల్లో మాత్రం మామూలు నిబంధనలతో సంబంధం లేకుండా ప్రత్యేక నిబంధనలు వర్తిస్తాయి.

జిఎస్‌టి చట్టంలోని సెక్షన్ 12 ప్రకారం వస్తువుల సరఫరా ఎప్పుడు జరిగింది అంటే

(ఏ) 1. వస్తువులను సరఫరా నిమిత్తం అవి వుండే స్థలం నుండి స్థాన చలనం , లేదా

2. వస్తువులకు స్థాన చలనం లేనిపక్షంలో వాటిని సరఫరా కోరుకునేవారి ఆధీనంలో వుంచినా

(బి) సరఫరాకు సంబంధించి సరఫరాదారుడు బిల్లు ఇచ్చినప్పుడు

(సి) సరఫరా చేసే వ్యక్తికి సరఫరాకు సంబంధించిన పైకము ముట్టినప్పుడు...లేక

(డి) సరఫరా కోరుకునేవారు వారి అకౌంట్ పుస్తకములలో సరఫరా గురించి ప్రస్తావించినప్పుడు

పైన పేర్కొన్న అంశాల్లో ఏది ముందు జరిగినా సరఫరాగా భావిస్తారు.

**రివర్స్ సరఫరా :**

పన్ను కనుక రివర్స్ సరఫరా ప్రకారం చెల్లించవలసివుంటే ఈ క్రింద పేర్కొన్న వాటిలో ఏది ముందుగా జరిగితే అది సరఫరా జరిగిన సమయంగా పరిగణించాలి.

(ఏ) వస్తువులు అందిన తారీఖు... లేదా

(బి) వస్తువులకు సంబంధించిన పైకము ఇచ్చినప్పుడు

(సి) బిల్లు అందుకున్నప్పుడు..లేదా

(డి) ఖర్చును అకౌంటు పుస్తకాల్లో నమోదు చేసుకున్నప్పుడు

**వస్తువులను ఆమోదించడంపై అమ్మితే :** సరఫరా జరిగిందని తెలిసే ముందే వస్తువులను తొలగించడం జరిగితే ఏ సమయంలో సరఫరా జరిగిందో

(ఏ) అప్పుడు సరఫరా జరిగిందని సరఫరాదారునికి తెలిస్తే అప్పుడు..లేదా

(బి) తొలగించిన 6 నెలలు

పైన పేర్కొన్న అంశాల్లో ఏది ముందుగా జరిగితే దానిని సరఫరా జరిపిన సమయంగా తీసుకోవాలి.

పైన పేర్కొన్న విధంగా సమయాన్ని నిర్ధారించలేకపోతే సరఫరా జరిపిన సమయాన్ని క్రింద పేర్కొన్న విధంగా నిర్ధారించవచ్చు.

(ఏ) సమయానుగుణంగా రిటర్న్ దాఖలు చేయాల్సివస్తే ఆ రిటర్న్ దాఖలు చేయాల్సిన సమయం... లేక

(బి) సిజిఎస్‌టి.. ఎస్‌జిఎస్‌టి చెల్లించిన తారీఖును సరఫరా జరిగిన సమయంగా భావించాలి.

**సేవలు జరిగిన సమయం :**

జిఎస్‌టి చట్టంలో సెక్షన్ (13) ప్రకారం సేవలు ఏ సమయంలో జరిగాయో వివరించబడ్డాయి. అవి...

1. బిల్లు నిర్ధారించిన సమయంలో ఇస్తే

(ఏ) బిల్లు ఇచ్చిన సమయం లేదా (బి) నగదు తీసుకున్న సమయం. (ఏ) (బి)లలో ఏది ముందు జరిగితే ఆ సమయంలో సేవలు జరిగినట్లు భావించాలి.

2. బిల్లు కనుక నిర్దిష్ట కాలపరిమితితో ఇవ్వనిచో

(ఏ) సేవలు అందించడం ముగిసిన సమయం... లేదా

(బి) నగదు అందిన తారీఖు

పైన పేర్కొన్న అంశాలలో ఏది ముందుగా జరిగితే దాని సేవలు జరిగిన సమయంగా పరిగణించాలి.

3) పైన పేర్కొన్నవి ఏవీ కానప్పుడు అకౌంట్ పుస్తకాల్లో సేవలను వినియోగించుకున్న వ్యక్తి నమోదు చేసిన రోజు.

**నిరవధిక సరఫరాలు :** సేవలకు చెల్లించవలసిన సమయాన్ని నిర్ధారించుకోగలిగితే

(1) బిల్లు తయారీతో సంబంధం లేకుండా సేవలను వినియోగించుకున్నవారు నగదు చెల్లించాల్సిన రోజు

(2) ఏదైనా నగదు సరఫరాదారుడు స్వీకరిస్తే పైన పేర్కొన్న అంశాలలో ఏది ముందుగా జరిగితే దానిని సేవలను సరఫరా చేసిన సమయంగా పరిగణించాలి.

(బి) సేవలకు చెల్లించవలసిన సమయాన్ని నిర్ధారించలేకపోతే..

(1) సేవలను సరఫరా చేసిన వ్యక్తి నగదు తీసుకున్నప్పుడు..లేక

(2) ఏది ముందుగా జరిగితే దానిని సేవలు సరఫరా సమయంగా తీసుకోవాలి.

రివర్స్ చార్జ్ : ఏదైనా సేవలకు పన్ను రివర్స్ చార్జ్ రూపంలో చెల్లించినా లేక చెల్లించాల్సివస్తే ఈ క్రింద పేర్కొన్న అంశాలలో ఏది ముందుగా జరిగితే ఆ సమయంలో సేవలను వినియోగించుకునే వ్యక్తి పన్ను కట్టవలసివుంటుంది.

(మిగతా వచ్చేవారం)

## కల్యాణ వైభవం...!



ఏపి ఆర్యవైశ్య మహాసభ నాయకులు కె.వి.చలమయ్య మనుమరాలు, కోనా వెంకట నాగరాజా-వరలక్ష్మిల కుమార్తె **పూజిత - జయవెంకట వేణుమాధవ్** (ఖమ్మం వాస్తవ్యులు మారం వెంకటేశ్వరరావు - నాగసత్యవతిల కుమారుడు)ల కల్యాణం ఈ నెల 10వ తేదీ నెల్లూరులోని అచ్చుతసుబ్రహ్మణ్యం కళ్యాణ మండపం నందు జరిగింది. నూతన వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.



# ఒకే ఒక్కడు

- **అంతుచిక్కని 'పవన్ పంథా'**
- **జనం తప్ప 'సేనే' లేని..'జనసేన'**

***'నాక్కొంచెం తిక్కుంది..దానికో లెక్కుంది'..అంటూ గబ్బర్‌సింగ్ సినిమాలో పవన్ కల్యాణ్ పదేపదే చెప్తుంటాడు. కానీ, ప్రస్తుతం 'జనసేన' విషయంలో మాత్రం పవన్‌కి ఓ లెక్కుందని ఆ లెక్కకు కొంచెం తిక్క, తిరకాసు వుందనిపిస్తోంది.***

జనసేనాధిపతి ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలనుకోవడం మంచిదే. ఆహ్వానించదగిన పరిణామమే. అందుకు ఎవరూ కాదనరు. అయితే, సినిమా వేరు..నిజ జీవితం వేరు. ఈ చిన్న తేడాను ఎవరైనాసరే గుర్తించాల్సి వుంది. సినిమాను చూసినట్లు జీవితాన్ని కానీ, జీవితాన్ని సినిమాలా కానీ చూడకూడదు. ఎందుకంటే, సినిమా సంగతి వేరు.. ఏదెలా వున్నా చివరికొచ్చేసరికి హీరో గెలవడాన్నే చూపిస్తారు. అయితే, జీవితాల్లో అలా వుండదు. రాజకీయజీవితాల్లో అస్సలు అలా వుండనే వుండదు. తామే హీరో అవుతామనుకున్నవారు.. మధ్యలోనే జీరోలుగా మారిపోవడం వంటి సీన్లు రాజకీయాల్లో బోలెడన్ని. సినిమా అంటే 24 ఫ్రేమ్‌లు వుండొచ్చు.. కానీ రాజకీయాలకు లెక్కలేనన్ని కోణాలుంటాయి. వాటిని ఎప్పటికప్పుడు పరిశీలించి అప్పటికప్పుడు సరైన సమయంలో సరైన ఆలోచనతో నిర్ణయాలు తీసుకోకుంటే ఫలితాలు తారుమారవుతుంటాయి. అందుకే రాజకీయాల్లో ప్రతి అడుగూ ఆచితూచి వేయాలని, ప్రతి విషయాన్ని ఆమూలాగ్రం పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలని రాజకీయ పండితులు పదేపదే చెప్తుంటారు. ఇంత కథా ఎందుకు చెప్పాల్సివస్తోందంటే, పవన్ కల్యాణ్ సభలు చూస్తుంటే, ఏదో సినిమా చూసినట్లుందే తప్ప.. ఆచరణలో అవన్నీ సాధ్యమేనా అనిపిస్తోంది.ఒక్కొక్క డైలాగ్ అద్భుతంగానే వుంది తప్ప నిజజీవితంలో అవన్నీ అనుకున్నవి అనుకున్నట్లు జరిగేనా అనిపిస్తుంది. తాను ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చేస్తున్నానని, ప్రజలకోసం ప్రజల మనిషిగా పనిచేస్తానని, 2019 ఎన్నికల్లో పోటీ చేస్తానని అద్భుతంగా ప్రకటించి నిజంగానే హీరో అన్పించుకున్నాడు. ప్రత్యేకహోదాపై పోరాటం చేస్తానన్నాడు. నేతల తీరును ఎండ గట్టాడు. తప్పులు సరిదిద్దుకోకపోతే జనసేన ఊరుకోదని చెప్పాడు. నేతల విధానాలపై జనసేన పోరాటం చేస్తుందని, వ్యక్తులపై కాదని స్పష్టం చేశాడు. ముఖ్యమంత్రి చంద్రబాబు కానీ, ప్రతిపక్ష నేత జగన్ కానీ చేసిన వాగ్దానాలు నెరవేర్చాలన్నాడు. వారిద్దరికీ తాను వ్యతిరేకిని కాదని, వారి విధానాలకే తాను వ్యతిరేకినన్నాడు. రాజధానిలో అన్ని ప్రాంతాలకు సమాన భాగస్వామ్యం వుండాలన్నాడు. ఆడబిడ్డ, రైతన్న కన్నీళ్ళు పెట్టకూడదన్నాడు. అన్నదాత కోసం ప్రాణాలర్పిస్తామన్నాడు. దేశాన్ని కాపాడే జవాన్లంటే ఎంతో గౌరవమంటూ, అందుకే 'జై జవాన్-జై కిసాన్' అనేది జనసేన నినాదమైందన్నాడు. అనర్గళంగా సాగిన ఆయన ప్రసంగానికి ప్రజలు, అభిమానులు జయజయధ్వానాలు చేశారు. కరతాళ ధ్వనులు మారుమ్రోగించారు. మంచిదే!.. ప్రత్యక్షంగా విన్నవారికి, ఆయన ప్రసంగాన్ని టీవీల్లో కన్న వారికి కూడా ఎంతో ముచ్చటేసింది. అయితే, ఇక్కడ సామాన్యజనం ఆశ్చర్యపోయిన విషయం ఏమిటంటే, ఎంత జనసేనాధిపతి అయినా, అసలు 'సేన' ఎక్కడా కనిపించకపోవడం ఏమిటా?..అని.

వంద మందికిపైగా కూర్చోగలిగినంత భారీ వేదికనైతే ఏర్పాటు చేస్తున్నారు కానీ... పవన్‌కళ్యాణ్ ఒక్కడే ఆ వేదికపైనుండి మాట్లాడడాన్ని జనం విడ్డూరంగా చూస్తున్నారు. ఏ రాజుకైనా ఒక మంత్రి, కొంత సైన్యం, ఆ సైన్యానికి అధ్యక్షుడు, ఇంకా కొంత బలగం వగైరాలన్నీ వుంటాయి. అవన్నీ జనానికి కన్పించకుంటే.. చూసేవారికి అదేదో సినిమాలాగానే వుంటుంది. వేదికపై ఒక్క హీరోయే మాట్లాడడం సినిమాల్లో మామూలే కానీ, రాజకీయాల్లో అలా కాదు కదా!.. ఆయా ప్రాంతాలకు సంబంధించిన నాయకులు, లేదా ముఖ్యమైన ప్రతినిధులు, పార్టీని ముందుకు నడిపించే నాయకగణం వంటివారే అసలైన సేన. ఎంతసేపటికీ 'నేను' అనే పదమే తప్ప, 'మేము' అన్నదే వినిపించకపోవడం మరింత ఆశ్చర్యకరం. గతంలో ఎన్టీఆర్ కూడా రాజకీయాల్లోకి ఇలాగే ఎంతో ఆవేశంగా వచ్చినా ఆయా ప్రాంతాల్లోని నాయకులను వెంటబెట్టుకునే రంగంలోకి వచ్చేవారు. స్థానిక నాయకులే అక్కడ కనిపించేవారు. వారి ఆధ్వర్యంలోనే ఎంతటి కార్యక్రమమైనా జరిగేది. అంతేకాదు, ఎన్టీఆర్ ఎక్కడికి వచ్చినా ఆయా ప్రాంతాల సమస్యలపై అవగాహనతో మాట్లాడి, ఆ సమస్యల సాధనకు తాను ఏమిచేయదలచుకున్నదీ చెప్పి జనమందరి ఆశీస్సులు అందుకున్నాడు. అందుకే ఎన్టీఆర్ అత్యద్భుత విజయం సాధించాడు. ఇప్పుడు పవన్ జనసేనకు ఎంతో ప్రాధాన్యత వున్న ఆయన సభలలో స్థానికంగా వున్న అలాంటి నాయకులు వేదికపై ఎక్కడా కనిపించకపోవడం విస్మయమే మరి!..అయితే, పార్టీకి వెన్నుదన్ను అందించే నాయకులు ఎవరన్నది బహుశా ఇంకా ఖరారు కాలేదేమో తెలియదు. ఇక్కడొక అనుకూలమైన అంశం ఏమిటంటే, పవర్‌స్టార్ పవన్‌కు అభిమానుల కొదవ లేదు. ప్రజాభిమానం వెల్లువగా వుంది. రాజకీయసాగరాన్ని ఈదగలిగిన సత్తా కూడా పవన్‌కు వుంది. అయితే, పవర్ కావాలంటే కావాల్సిందల్లా సంయమనం. సరైన ఆలోచనా దృక్పథం. రాజకీయాల్లో ఆలోచనే తప్ప ఆవేశం ఏనాటికీ పనికిరాదు. ఒకవేళ ఆవేశపడాల్సివచ్చినా అందుకు బాగా ఆలోచించే ఎంతవరకు ఆవేశపడాలో అంతవరకే ఆవేశపడాల్సివుంది. ఎందుకంటే, రాజకీయాలు ఎప్పుడు ఎలా వుంటాయో.. ఎప్పుడు ఎలా మారిపోతాయో.. ఎప్పుడు ఎవరిని అందల మెక్కిస్తాయో.. ఎప్పుడు ఎవరిని కిందికి నెట్టేస్తాయో అంతు పట్టని రంగమది. రాజకీయాల్లో ప్రతి అడుగూ ఆచితూచి వేయాల్సిందే..ఎప్పటికప్పుడు లెక్కలేసుకుంటూ పోవలసిందే. ఉదా హరణకు జగన్ విషయమే తీసుకుందాం. గత ఎన్నికల్లో తనకి తిరుగే లేదనుకున్నప్పటికీ, తీరా ఎన్నికలయ్యేసరికి కేవలం కొద్దిశాతం తేడాతో ఫలితం తారుమారయ్యింది. సినిమాల్లోనే కాక, రాజకీయాల్లో కూడా పవన్ హీరోగానో, నంబర్ వన్‌గానో ఎదగాలంటే అందుకు ఆవేశంగా కాక, ఆలోచనాత్మకంగా..అన్ని కోణాల్లోనూ పరిశీలించి పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనించి..ఆచితూచి అడుగు ముందడుగు వేయాలి. ఆయన జనంలోకి వెళ్ళకముందే ఆయన సేనని సమాజానికి పరిచయం చెయ్యాలి... తదుపరి మీటింగ్ కన్నా ఆయన పంథా మారాలి.

# నోట్ల కోసం కోటి పాట్లు



ఎవరూ ఊహించలేదు ఈ పరిస్థితి వస్తుందని... ఎవరు కూడా అనుకోలేదు చిల్లర కోసం బ్యాంకుల ముందు క్యూలో నిలబడాల్సి వస్తుందని! రేషన్‌షాపుల్లో రేషన్ కోసం, సినిమా హాళ్లలో టిక్కెట్ల కోసం, గుళ్లలో దేవుని దర్శనం కోసం, జియో సిమ్ కోసం రిలయన్స్ షాపుల వద్ద... ఇలా 'క్యూ'లలో నిలబడిన వాళ్లే కాని, చిల్లర కోసం జనం ఏరోజూ 'క్యూ'లలో నిల్చోలేదు. అసలు మొన్నటి దాకా పరిస్థితి ఏంటి? మనం లక్ష రూపాయలు డ్రా చేసుకుందామని బ్యాంకుకు వెళితే, క్యాషియర్ లక్ష నగదును పెద్దనోట్లు లేవని చిల్లర రూపంలో ఇస్తే... అబ్బే ఇవి ఎవడు మోసుకుపోతాడు, వెయ్యి లేదా 500నోట్లు ఉంటే ఇవ్వమనేవాళ్లం. ఇప్పుడు కాలం తిరగబడింది. వెయ్యి, 500 నోట్లను గొంగళి పురుగులుగా, వంద రూపాయల నోటును సీతాకోకచిలుక మాదిరిగా చూస్తున్నారు.

పెద్దనోట్ల రద్దుతో చిన్నా, పెద్దా, ధనిక, బీద తేడా లేకుండా ప్రధాని నరేంద్రమోడీ అందరినీ రోడ్ల మీద నిలబెట్టాడు. పెద్దనోట్లు రద్దు విషయాన్ని ప్రకటించి పదిరోజులు దాటినా ప్రజలకు చిల్లర కష్టాలు ఇంకా తీరలేదు. బ్యాంకుల ముందు, ఏటిఎంల ముందు అవే క్యూలు... అదే జనం... ఏ మాత్రం తగ్గడంలేదు. ఏటిఎంలో డబ్బు పెట్టిన గంట, రెండు గంటలకల్లా ఖాళీ అయిపోతుంది. గంటల కొద్దీ 'క్యూ'లో నిలబడ్డ జనం తమదాకా డబ్బులు రాక పోవడంతో ఉసూరుమంటున్నారు. ఒకసారి డబ్బులు తీసుకున్న వాళ్లే మళ్లీ మళ్లీ బ్యాంకులకు వస్తుండడంతో ఎంత డబ్బు కూడా చాలడం లేదు. ముఖ్యంగా గ్రామీణ ప్రజలైతే చిల్లర కోసం తమ దగ్గరవున్న నాలుగు రూపాయలను దాచుకోవడం కోసం నానా ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాలలో బ్యాంకులు, ఏటిఎంలు ఉండవుకదా! ఇక బ్యాంకు విత్‌డ్రాలలో రెండు వేల నోట్లు ఇస్తున్నారు. 500నోట్లు ఇచ్చుంటే కొంతవరకు సమస్య తీరేది. మార్కెట్‌లో ఈ రెండు వేల నోట్లు ఎందుకూ ఉపయోగ పడడం లేదు. రెండు వేల నోటిచ్చి రెండొందల రూపాయలకు సరుకులు కొని, మిగతా 1800 రూపాయలు ఇవ్వమంటే ఇవ్వలేరుగా! అదే 500నోట్లు ఇచ్చుంటే ఈ సమస్య కొంతవరకన్నా ఉండేది కాదు.

పెద్దనోట్ల రద్దుతో వ్యాపారాలన్నీ తగ్గిపోయాయి. కార్ల అమ్మకాల వద్ద నుండి కాకరకాయల అమ్మకాల వరకు దీని ప్రభావం కనిపిస్తోంది. బ్లాక్‌మనీ కట్టడితో లగ్జరీ వ్యాపారాలు తగ్గిపోగా, చిల్లర సమస్యతో చిన్న వ్యాపారాలు తగ్గాయి. విచ్చలవిడి ఖర్చులు తగ్గాయి. ఎస్2 సినిమాస్‌లో ప్రేక్షకులు తగ్గారు. ఎం.జి మాల్‌లో జనం తగ్గారు. షాపింగ్‌మాల్స్‌లో సేల్స్ తగ్గాయి. పిజ్జాలు, బర్గర్‌లు తినేవాళ్లు నోర్లు కట్టేసుకుంటున్నారు. అవసరమైన వాటిని మాత్రమే ప్రజలు కొనుగోలు చేస్తుండడంతో ప్రతి వ్యాపారం కూడా బాగా పడిపోయింది. ప్రజల వద్దకు మళ్లీ చిన్న నోట్లు దండిగా చేరితే చిన్న చిన్న వ్యాపారాలు తిరిగి పుంజుకునే అవకాశముంది. అయితే బ్లాక్‌మనీ ఆగిపోతే లగ్జరీ వ్యాపారాలు బంద్ అయినట్లే! ఆ వ్యాపారాలు పడిపోతే కమర్షియల్ అద్దెలు తగ్గడంతో పాటు మార్కెట్‌లో చాలామార్పులు చోటుచేసుకోవచ్చు.

# పట్టాభికే పట్టభద్రుల సీటు



చంద్రబాబు మంత్రివర్గంలోకి నారాయణను తీసుకున్నప్పుడే అర్ధమైపోయింది... మున్ముందు ఆయన నిర్ణయాలు ఎంత నికృష్టంగా ఉండబోతున్నాయో... ఆయన మంత్రిగా తీసుకున్న నారాయణ నిర్ణయాలు ఇంకెంత ముదనష్టంగా ఉండబోతున్నాయన్న విషయం. మంత్రి పదవికి నారాయణ అనర్హుడు. ప్రజల కష్టనష్టాలు తెలియని మనిషి మంత్రిగా వుంటే పరిస్థితులు ఎంత అధ్వాన్నంగా ఉంటాయో గత రెండున్నరేళ్ల నుండి చూస్తున్నాం. ఇప్పుడు మరో అసంబద్ధ నిర్ణయం తీసుకుని మన మంత్రిగారు తన విధానాన్ని చాటుకున్నారు.

శాసనమండలి అంటేనే విద్యావంతులు, గౌరవప్రదమైన వ్యక్తులు ఉండాల్సిన చోటు. సాధారణంగా ఆయా వృత్తులు, వివిధ రంగాలలో నిష్ణాతులను ఎమ్మెల్సీ అభ్యర్థులుగా నిర్ణయిస్తుంటారు. కాని నారాయణ మాత్రం నెల్లూరు, ప్రకాశం, చిత్తూరుజిల్లాల పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గానికి తెలుగుదేశం అభ్యర్థిగా వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డిని ఎంపిక చేయించారు. ఈ విషయం చాలారోజుల నుండే ప్రచారంలో వున్నా, బుధవారం అధికారికంగా వెలువడింది. ఈ పట్టాభి ఎవరో లోకం మొత్తానికి తెలుసు. నారాయణకు అత్యంత సన్నిహితుడు. ఒకప్పుడు అదే సంస్థలో ఉద్యోగి. గతంలో తెలుగుదేశంలో వున్న పట్టాభి కోవూరు వ్యవసాయ మార్కెటింగ్ కమిటి ఛైర్మెన్‌గా పని చేశారు. ఆ తర్వాత కాంగ్రెస్‌లోకి దూరారు. కొంతకాలం కోవూరు కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్‌గా కూడా వ్యవహరించారు. 2014 ఎన్నికల తర్వాత మళ్లీ తెలుగు దేశంలో చేరి మంత్రి నారాయణ ఏజెంట్‌గా ఉంటున్నాడు. నారాయణ నుండి గట్టి హామీ ఉండడంతో చాలారోజుల క్రితం నుండే వీళ్లు డబ్బులు ఖర్చుపెట్టుకుంటూ పట్టభద్రుల ఓట్ల నమోదును జోరుగా చేయిస్తున్నారు. పట్టాభి అభ్యర్థిత్వం పట్ల తెలుగుదేశం కేడర్‌లోనే తీవ్ర అసంతృప్తి నెలకొన్నట్లు తెలుస్తోంది.

## 'ప్రభా'తం

# 'బ్లాక్'.. ఢమేల్!

**పెద్దనోట్ల రద్దు ద్వారా అవినీతి, నకిలీనోట్లు, ఉగ్రవాదానికి ఊత మందించే నల్లధనంపై సమరభేరీ మోగింది. ప్రధాని మోడీ తీసుకున్న ఈ నిర్ణయానికి దేశప్రజల నుంచి సంతోషం వ్యక్తమవుతోంది. దీని వల్ల ప్రజలకు తాత్కాలికంగా కొన్ని ఇబ్బందులున్నా దేశానికి.. దేశప్రజలకు ఎంతో మేలు కలుగనుంది. ఈ నేపథ్యంలో, దేశానికి ఎంతగానో ఉపకరించే ఇలాంటి నిర్ణయాలను హర్షించి సహకరించాల్సిందిపోయి.. పలు రాజకీయపక్షాలు ప్రభుత్వంపై లేనిపోని విమర్శలు చేయడం, నిందారోపణలు చేయడం ఎంతైనా విచారకరం.**

*"ఈ దేశం అవినీతితో అలసిపోయింది. భారత్‌ను అవినీతి రహిత దేశంగా చేయడానికి నా మనస్సులో ఇంకా చాలా ప్రాజెక్టులున్నాయి. అవినీతిపరులు, వారిని రక్షించేవారూ చెవులు రిక్కించి వినండి..డిసెంబరు 30 తర్వాత కూడా మోదీ ఈ పని ఆపడు. ఈ దేశం కోసం నేను అన్నింటినీ వదిలేశాను. నా ఊరిని..నా ఇంటిని..నా కుటుంబాన్ని వదిలేశాను. ప్రజలు కోరుకున్న భారత్‌ను అందించేందుకు.. అవినీతి రహిత భారత్ నిర్మాణమే ధ్యేయంగా పనిచేస్తున్నా. అవినీతిపై యుద్ధాన్ని ఆపే ప్రసక్తే లేదు, అవినీతిశక్తుల చరిత్రంతా తవ్వి తీస్తా!..బినామీ ఆస్తులనూ వదిలిపెట్టే ప్రసక్తే లేదు. బినామీ బాగోతాల భరతం పడతా!"*

\- ప్రధాని మోడీ.

ప్రధాని మోడీ తీసుకుంటున్న ఇలాంటి సంచలనాత్మక నిర్ణయాలతో నల్లధన రాకాసి గుండెలు డబడబా కొట్టుకుంటున్నాయి. ఎక్కడ 'బ్లాక్' మనీ వున్నా సరే, కలుగుల్లో ఎలుకల్ని కలుగుల్లోనే పట్టుకున్నట్లుగా వుంది పరిస్థితి. 'బ్లాక్' ఎక్కడున్నా లెక్కల్లోకి రావాల్సిందే.. లేదంటే అది ఏ నుయ్యో గొయ్యో చూసుకోవాల్సిందే. అంతే తప్ప మరో ప్రత్యామ్నాయ మార్గం లేకపోవడంతో నల్లధన రాకాసులకు ఊపిరి సలపడం లేదు. ఏళ్ళతరబడి అదేపనిగా కోట్లుకోట్లుగా కూడబెట్టిన ఆ అక్రమ ధనరాశుల్ని ఇప్పుడు ఏమిచేయాలో తెలియక నల్లకుబేరులు తలలు పట్టుకుంటున్నారు. ఆ అయోమయంతోనే ఇప్పటికే పలుచోట్ల 'పెద్దనోట్లు' ఏ నదుల్లోనో.. మురుగుకాలువల్లోనో మునకలు వేస్తున్న దృశ్యాలు అక్కడక్కడా దర్శనమిస్తున్నాయి. దేశంలో వందలకోట్లలో మూలుగుతున్న నల్లధనరాశుల్ని పూర్తిగా నిరుపయోగం చేయడానికి మోడీ వేసిన చక్రబంధం ఇది. నల్లకుబేరులకు ఎలాంటి చిన్న అవకాశం కూడా ఇవ్వకుండా ఎక్కడికక్కడ బోల్టులు బిగించేయడంతో అష్టదిగ్బంధనం చేసినట్లయింది. దీంతో, నల్లడబ్బు గుట్టలుగుట్టలుగా పేర్చుకున్నవారి కంటికి అసలు కునుకే రావడం లేదు. అయితే, పేదలకు..సామాన్యులకు ఆ బాధే లేదు. పెద్దనోట్ల రద్దుతో తాత్కాలికంగా ఏర్పడిన చిల్లరకొరత, పాతనోట్ల మార్పిడికి జరిగే జాప్యం వగైరా ఇబ్బందులు తప్ప, కష్టార్జితమైన వారి డబ్బుకు ఎలాంటి ఢోకా లేదు. ఇప్పుడు వచ్చిన చిక్కంతా కోట్లాదిగా నల్లడబ్బును కూడబెట్టుకున్న కుబేరులకే. దేశవ్యాప్తంగా జరుగుతున్న ఈ నల్లధన నిర్మూలన యజ్ఞం దేశంలోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా సంచలనం కలిగిస్తోంది. దేశ ఆర్థికవ్యవస్థను ప్రక్షాళన చేసేందుకు తలపెట్టిన ఈ బృహత్తర మహత్తర యజ్ఞంలో దేశప్రజలంతా భాగస్వాములు కావాలని, ఈ పరిస్థితి ఒక కొలిక్కివచ్చేదాకా కొన్ని ఇబ్బందులు ఎదురైనా దేశక్షేమం దృష్ట్యా ఆ ఇబ్బందులను పెద్దగా పట్టించుకోవద్దని ఎంతో చిత్తశుద్ధితో.. దేశభక్తితో ప్రధాని మోదీ వినమ్రంగా విజ్ఞప్తి చేయడం దేశప్రజలను మరెంతగానో ఆకట్టుకుంది. ప్రధాని మోడీ చేస్తున్న ఈ యుద్ధానికి ప్రజలంతా బాసటగా నిలుస్తున్నారు కూడా. అవినీతికి, నకిలీ నల్లధనానికి, ప్రత్యేకించి ఉగ్రవాదానికి ఆర్థిక దన్నుగా ఊతమిస్తున్న నల్లడబ్బు కోరలు పీకేందుకు జాతి సంక్షేమం-ప్రయోజనాల దృష్ట్యా తీసుకున్న ఈ సాహసోపేతమైన నిర్ణయాన్ని ప్రజలంతా ఎంతగానో హర్షిస్తున్నారు. అంతేకాదు, అవినీతిని మట్టుబెట్టేందుకు ప్రధాని మోడీ చేస్తున్న ఈ ప్రయత్నాలను హర్షాతిరేకంతో స్వాగతిస్తున్నారు. దేశ అభ్యున్నతికి, అవినీతి రహిత భారత్ నిర్మాణానికి జరుగుతున్న ఈ బృహత్‌యజ్ఞాన్ని దేశసంక్షేమం కోరుకునేవారంతా మనసారా ఆహ్వానిస్తున్నారు..గుండె దిటవుతో అవినీతిపై యుద్ధానికి దిగిన ప్రధానిని నిండు మనసుతో ఆశీర్వదిస్తున్నారు. పెద్దనోట్ల రద్దుతో కొన్ని లక్షల కోట్లు ప్రభుత్వానికి చేరి ఆ ధనమంతా పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమానికి ఉపయోగపెట్టేందుకు వీలుంటుంది కనుక దేశప్రగతిని కాంక్షించేవారంతా ప్రభుత్వ నిర్ణయాలను హర్షిస్తున్నారు. ఈ క్రమంలో కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నా ప్రజలు సంతోషంతోనే సహిస్తున్నారు. దేశ సౌభాగ్యానికి.. ఒక సమున్నతమైన లక్ష్యసాధనకు తామూ సహకరించగలుగుతున్నామనే భావనతో, ప్రభుత్వ నిర్ణయానుసారం తమ కష్టార్జితాన్ని బ్యాంకుల్లో డిపాజిట్ చేయడానికి ఎంతో శ్రమతో.. ఓపికతో గంటల తరబడి క్యూలలో నిలబడుతున్నారు. ఈ నేపథ్యంలో, ప్రభుత్వం కొన్ని ముందస్తు చర్యలు కూడా తీసుకునివుంటే ప్రజలకు బహుశా ఇన్ని కష్టాలు లేకుండా కొంత వెసులుబాటు వుండేదేమో!.. అయితే, నల్లధన రాకాసులకు ఈ విషయమై ఎలాంటి ఉప్పందకుండా పకడ్బందీగా చేయాలని.. నల్లకుబేరులు తప్పించుకునేందుకు వున్న అన్ని మార్గాలను మూసివేయాలన్నదే ప్రభుత్వ తాపత్రయం కనుక ప్రధాని మోడీ ఈ విషయాన్ని ఎంతో గోప్యంగా వుంచి, హటాత్తుగా పెద్దనోట్లను రద్దుచేయడంతో ప్రజలకు కొన్ని ఇబ్బందులు తప్పడం లేదు. బినామీ లావాదేవీల నిషేధ చట్టం అమలులోకి వచ్చిన వారానికే పెద్దనోట్ల రద్దు ద్వారా నల్లధనం ఆటకట్టించేందుకు ప్రభుత్వం సమరభేరీ మోగించింది. ప్రధాని నిర్ణయంతో దేశప్రజలకు ఎంతో మేలు కలుగనున్న ఈ నేపథ్యంలో పలు రాజకీయపక్షాలు ప్రభుత్వానికి సహకరించాల్సిందిపోయి..ప్రభుత్వంపై లేనిపోని విమర్శలు చేయడం ద్వారా రాజకీయ పబ్బం గడుపుకోవాలనుకోవడం ఎంతైనా దురదృష్టకరం. అంతేకాదు, దేశభవితకు ఎంతో కీలకమైన ఈ సమయంలో రాజకీయపక్షాలవారు ప్రభుత్వంవైపు..ప్రజలవైపు నిలుస్తారో.. లేదంటే అవినీతికి మూల కారణమైన నల్లధనరాకాసుల వైపు నిలుస్తారో ఎవరి విజ్ఞత వారిది. ఏదేమైనా, నల్లధనాన్ని నిలువరించే ఈదశలో వస్తున్న సమస్యలను విపక్షాలు సరైన అవగాహనతో చర్చించుకుని సమస్యలను అధిగమించేందుకు సహృదయంతో ప్రభుత్వానికి సహకరించవచ్చు. సద్విమర్శల ద్వారా దేశాభివృద్ధికి బాటలు వేయవచ్చు. అంతే తప్ప, పెద్దనోట్ల రద్దు నిర్ణయం వెనుక భారీ కుట్ర వుందనడం..ఇదో పెద్ద కుంభకోణమంటూ కువిమర్శలు చేయడం మంచిది కాదు. దేశ భవితకు ఎంతగానో ఉపయోగపడే ఇలాంటి మంచి నిర్ణయాల పట్ల అనుచితమైన మాటలు ఎవరికీ సముచితం కాదు.

### విద్యార్థుల సమస్యలపై...

# స్పందించకుంటే ఉద్యమమే!



నెల్లూరు వైయస్సార్ స్టూడెంట్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం సర్వోదయ కళాశాలలో జిల్లాలో వున్న అన్ని విద్యార్థి సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వైయస్సార్ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి తలపల జయవర్ధన్ మాట్లాడుతూ నెల్లూరుజిల్లాలో వున్న ఏ కళాశాలలో కూడా పూర్తి స్థాయి ప్రయోగశాలలు లేవన్నారు. శ్రీచైతన్య, నారాయణ వంటి కార్పొరేట్ విద్యాసంస్థలు ఒక బ్రాంచ్‌లో ప్రయోగశాలలు పెట్టుకొని ఆ పరికరాలనే అధికారులు ఇన్స్‌పెక్షన్‌కి వచ్చినప్పుడు మరో‌బ్రాంచ్‌కి మార్చి అధికారులు వెళ్లిపోగానే మళ్లీ యధాతదం చేస్తున్నారని ఆరోపించారు. ఈ విద్యా సంవత్సరం నుంచి జంబ్లింగ్ విధానంలో ప్రాక్టికల్స్ ఎగ్జామ్స్ జరుగుతున్నందున ఒకే విధమైన పరికరాలు పూర్తి స్థాయిలో ఉండాలని, లేని పక్షంలో విద్యార్థులు ఎక్కువుగా నష్టపోయే పరిస్థితి ఉందన్నారు. ఈ సమావేశంలో టిఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర నాయకుడు ముజీర్, ఎస్ఐఎఫ్ సహాయ కార్యదర్శి టి.శ్రీనివాసులు, ఎఐయస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాసీర్, విద్యార్థి జేఏసి నాయకులు ఆదిత్య సాయి, అంజయ్య, టిఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు ముజీర్, వైయస్సార్సీపీ నగర అధ్యక్షుడు శేషు, రాకేష్, మధు, శ్రీహరి, పవన్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## రంగనాథునికి బంగారు గరుడ సేవ

చిలుక ద్వాదశిని పురస్కరించుకుని నెల్లూరు రంగనాయకులపేటలోని శ్రీ తల్పగిరి రంగనాథస్వామి వారి దేవస్థానంలో ఈనెల 12న శ్రీ స్వామివారికి బంగారు గరుడసేవను నేత్రపర్వంగా నిర్వహించారు. ఈ ఉత్సవం మండపాలవీధిలోని మండపం వరకు సాగింది. అక్కడ శాస్త్రోక్తంగా తులశమ్మ వారికి పూజలు నిర్వహించారు. ఆలయ పాలకమండలి ఛైర్మెన్ మంచికంటి సుధాకర్‌రావు, కార్యనిర్వహణాధికారి పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

# నెహ్రూ ఆశయ సాధనకు పునరంకితం కావాలి



పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఆశయ సాధనకు పునరంకితం కావాలని నెల్లూరుజిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పనబాక కృష్ణయ్య పిలుపునిచ్చారు. సోమవారం చాచానెహ్రూ జయంతి సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇందిరాభవన్‌లో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడ నుంచి ర్యాలీగా మద్రాసుబస్టాండ్ వద్దనున్న నెహ్రూ విగ్రహం వద్దకు చేరుకుని పూలమాలలు వేసి స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో సి.వి.శేషారెడ్డి, చెంచలబాబు యాదవ్, చేవూరు దేవకుమార్‌రెడ్డి, పత్తిబాబు, భవానీ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.




## బినామీ ఆస్తుల మాటేమిటి?

అన్ని పార్టీలలో వున్న రాజకీయ నాయకులకు బినామీ ఆస్తులు వేలకోట్లలోనే వున్నాయి. కేంద్రంలో వున్న పెద్దలు కూడా బినామీ ఆస్తులు కలిగి ఉన్నారు. మరి ఇలాంటి దొంగల మాటేమిటి? ఎవరి పేరుతో వున్న ఆస్తులు వారికే చెందుతాయని ప్రభుత్వం చట్టం తేవాలి. లేదా బినామీ ఆస్థిదారులు ఈ ఆస్థి తమది కాదని, ఫలానా వ్యక్తిదని స్వచ్ఛంధంగా ముందుకొచ్చి వెల్లడిస్తే ఆ ఆస్థిలో సగభాగం ప్రభుత్వం టాక్స్ క్రింద తీసుకుని మిగతా సగభాగం బినామీకి చెందుతుందని చట్టం తేవాలి. ఈ చట్టం గనుక తెస్తే బినామీ పేర్లతో వున్న పెద్దల ఆస్తులు బయటకు వస్తాయి. అలాగే ఒక్కో వ్యక్తి పేరు మీద ఇంత విలువగల ఆస్థి మాత్రమే వుండాలి, ఆ పరిధి దాటితే ఆస్థి విలువలో 50శాతం పన్ను కట్టాలన్న విధంగా చట్టం తేవాలి.

**– సి.రాజీవి, నెల్లూరు.**

## సన్నజీవుల అవస్థ

పెద్దనోట్లను రద్దు చేస్తూ ప్రధాని నరేంద్రమోడీ తీసుకున్న నిర్ణయం వల్ల భవిష్యత్‌లో ఎలాంటి ప్రయోజనం కలగబోతుం దన్నదానికి గ్యారంటీ లేదు. కాని, ఇప్పుడైతే ఎంతోమంది రోడ్డునపడే అవకాశాలున్నాయి. రియల్‌ఎస్టేట్, ఫైనాన్స్ కంపెనీలు మూతపడతాయి. లక్షల మంది నిరుద్యోగులవుతారు. ఉపాధి పరంగా ప్రత్యామ్నాయ మార్గాల గురించి ఆలోచించకుండానే మోడీ ఈ నిర్ణయం తీసుకున్నారనిపిస్తుంది.

**కె.బాబు, నెల్లూరు.**

## లంచాలు ఆగినట్లేనా?

పెద్దనోట్లను రద్దు చేయడంతో పాటూ ఇక ఆర్థిక లావాదేవీలన్నీ బ్యాంకుల ద్వారా జరుగుతాయని చెప్పడంతో ప్రభుత్వ కార్యాలయాలలో అవినీతికి చెక్‌పెట్టినట్లేనని ప్రజలు భావిస్తున్నారు. ఇక్కడితో అవినీతి అంతమైతే నరేంద్రమోడీ దేశ ప్రజలకు ఇచ్చిన కానుకే అనుకోవాలి. కాని లంచాలకు అలవాటుపడ్డ ఉద్యోగులు ఇతరత్రా రూపంలో అవినీతికి పాల్పడకుండా ఉంటారా? భవిష్యత్‌లో ఎలాంటి మార్పులు చోటుచేసుకుంటాయో చూడాలి.

**– నాగసూరి వేణు, సూళ్లూరుపేట.**

## జన్మభూమి ఋణం తీర్చుకున్న

# కంచర్ల సోదరులు!





కన్నతల్లి, జన్మభూమి... ప్రతి వ్యక్తి కూడా కష్టాల్లోనే కాదు, సుఖాల్లో కూడా గుర్తుంచుకోవాల్సిన విషయాలు. మన జిల్లావాసి, కేంద్రమంత్రి యం.వెంకయ్య నాయుడు ఎన్ని సభల్లో ప్రసంగించినా ఈ విషయాన్ని ఖచ్చితంగా ప్రస్తావిస్తుంటారు. కన్నతల్లి, జన్మభూమి అంశాల ప్రచారానికి ఒక రకంగా వెంకయ్యనాయుడును బ్రాండ్ అంబాసిడర్ అని చెప్పుకోవచ్చు. ఆయన వల్లే స్ఫూర్తి పొందిన ఎంతోమంది తమ గ్రామం ఋణం తీర్చుకోవడానికి ఎంతో కొంత సేవ చేస్తుండడం చూస్తున్నాం.

ఈ పరంపరలో చెప్పుకోదగ్గ వ్యక్తులు డాక్టర్ కంచర్ల సోదరులు. ఏ.ఎస్.పేటకు మూడు కిలోమీటర్ల దూరంలో వున్న చిరమన అనే కుగ్రామంలో జన్మించి, ఈరోజు ప్రపంచంలోనే పేరెన్నికగన్న ఆసుపత్రుల అధిసారధులుగా వున్న గ్లోబెల్ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ కంచర్ల రవీంద్రనాథ్‌చౌదరి, రెయిన్‌బో హాస్పిటల్స్ అధినేత డాక్టర్ కంచర్ల రమేష్‌లతో పాటు వారి సోదరులు కంచర్ల సుధాకర్‌నాయుడు, కంచర్ల రమాధర్‌నాయుడులు తమకు తప్పటడుగులు నేర్పిన ఊరి ఋణాన్ని కొంతవరకు తీర్చుకున్నారు. తమ గ్రామ ప్రజలకు మెరుగైన వైద్యం, ఆధునిక విద్యను అందించాలన్న లక్ష్యంతో ఈ గ్రామంలో కంచర్ల సోదరుల సహకారంతో 78.15 లక్షల వ్యయంతో నిర్మించిన కీర్తిశేషులు కంచర్ల సరోజనమ్మ స్మారక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, 22.24 లక్షలతో నిర్మించిన కీర్తిశేషులు కంచర్ల శేషయ్యనాయుడు స్మారక హైస్కూల్‌లోని తరగతి గదులు, ల్యాబ్ గదులను ఈ నెల 13వ తేదీన కేంద్రమంత్రి యం.వెంకయ్య నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన తన ప్రసంగంలో ఎంత ఎత్తుకు ఎదిగినా పుట్టి పెరిగిన వూరిని, వూరి జనాన్ని మరచిపోకుండా, అభివృద్ధి చేసేందుకు చిరమన గ్రామాన్ని దత్తత తీసుకున్న కంచర్ల సోదరులను అభినందించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్రమంత్రులు పి.నారాయణ, కామినేని శ్రీనివాస్, పత్తిపాటి పుల్లారావు, ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే మేకపాటి గౌతమ్‌రెడ్డి, జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్సీలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, బీద రవిచంద్ర, వాకాటి నారాయణరెడ్డి, జాయింట్ కలెక్టర్ ఏఎండి ఇంతియాజ్, జడ్పీ సిఇఓ బి.రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పనులకు చిల్లర దెబ్బ!



రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక రెండేళ్ల దాకా ఎటువంటి పనులు లేవు. రియల్ ఎస్టేట్ పూర్తిగా పడిపోయింది. ప్రభుత్వ పరంగా ఎలాంటి పనులు మొదలు కాకపోవడంతో చాలా మంది ఖాళీగా వున్నారు. దీనికి తోడు ఇసుక వేలంలో చాలా కాలం స్థబ్దత నెలకొనడంతో ట్రాక్టర్లు, ప్రొక్లెయిన్‌లు, జేసీబీలు పని లేకుండా వుండిపోయాయి. కాగా, ఇటీవల మూడు, నాలుగు నెలల నుండి జిల్లాలో ముమ్మరంగా నీరు–చెట్టు పనులు మొదలయ్యాయి. ప్రతి నియోజకవర్గంలోనూ వందకోట్లకు తక్కువ కాకుండా చెక్‌డ్యాంలు, ఇతర సాగునీటి నిర్మాణాల పనులు జరుగుతున్నాయి. పనులు మొదలు కావడంతో నిర్మాణ కూలీలకు గిరాకీ పెరిగింది. జేసీబీలు, ప్రొక్లెన్‌లకు డిమాండ్ వచ్చింది. మిషన్‌లు ఖాళీగా లేకుండా పనిలో పడ్డాయి. నెల్లూరులో డ్రైనేజీ పైప్‌లైన్, మంచినీటి పైప్‌లైన్ పనులు మొదలుకావడం, అదే సమయంలో అన్ని మండలాలలో నీరు–చెట్టు పనులు ప్రారంభించడంతో కూలీలు దొరకడమే కష్టమైంది. అయితే పనులు ముమ్మరంగా మొదలైన తరుణంలోనే పెద్దనోట్ల రద్దు పనులు చేపట్టిన కాంట్రాక్టర్ల పాలిట శాపంగా మారింది. కూలీలకు ఇవ్వడానికి చిన్న నోట్లు లేకపోవడంతో వాళ్లు సరిగా పనులకు రాక కాంట్రాక్టర్లు ఇబ్బంది పడుతున్నారు. త్వరగా పనులు పూర్తి చేసి బిల్లులు పెట్టాలనుకున్న కాంట్రాక్టర్లకు ఇది విఘాతంగా మారింది.

# ఇరకాటంలో పాశం!

## ఫిరాయింపుపై నోటీసు



2014 ఎన్నికల్లో గూడూరు అసెంబ్లీ నుండి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గెలిచి, కొన్ని నెలల క్రితమే పార్టీ అధినేత జగన్‌ను, తనకు సీటిప్పించిన నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని బోల్తాకొట్టించి తెలుగుదేశంపార్టీలో చేరిన ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఇరకాటంలో పడ్డాడు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ వైకాపా వేసిన పిటిషన్‌ను విచారణకు తీసుకున్న హైకోర్టు వెంటనే పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలందరికీ నోటీసులు జారీ చేసింది. ఈ పరంపరలో గూడూరు ఎమ్మెల్యే పాశంకు కూడా నోటీసు వచ్చింది.

అయితే కేసు విచారణ వేగవంతంగా జరిగి అనర్హత వేటు పడితే పాశంకు ఇబ్బందే! రెండున్నరేళ్ల ఎమ్మెల్యే పదవీ కాలాన్ని కోల్పోయినట్లే! ఎందుకంటే పార్టీ మారారనడానికి ప్రత్యేకంగా సాక్ష్యాధారాలు అక్కరలేదు. పార్టీ మారిన విషయం అధికారికమే! కాబట్టి హైకోర్టులో విచారణ ప్రక్రియ త్వరగా పూర్తయితే వేటు పడడం ఖాయం. అయితే హైకోర్టులో వేటు పడగానే అయిపోతుందా? వెంటనే సుప్రీంకోర్టుకు పోతారు. స్టే తెచ్చుకుంటారు. శుభ్రంగా పదవుల్లో కొనసాగుతారు. మళ్లీ ఎన్నికలొచ్చే దాకా కూడా అక్కడ ఈ కేసు విచారణ తేలదు. మన న్యాయస్థానాలు కేసుల ప్రాధాన్యతను బట్టి నిర్ణయాలు తీసుకుంటే రాజకీయ నాయకులు గెలిచీగెలవగానే ఇలా పార్టీలెందుకు మారుతుంటారు. న్యాయవ్యవస్థ న్యాయబద్ధంగా పనిచేసి తొందరగా చర్య తీసుకుంటే పాశంకు ఆశనిపాతమే! మరి అలాంటి పరిస్థితి వస్తుందా? అన్నదే ప్రశ్నార్థకం!

# కుప్పకూలిన రియల్ మేడలు



- వీధుల్లో పడుతున్న రియల్టర్లు
- హడలెత్తిపోతున్న వడ్డీ వ్యాపారులు
- ఉపాధి, వ్యాపారాలపై పెనుప్రభావం

*ఒక అడవిలో నక్క కంట్లో నలుసుపడి కాళ్లో ముల్లుగుచ్చుకుని మూలుగుతూ తాటిచెట్టు క్రింద కూర్చుంది. అప్పుడే ఓ పండిన తాటికాయ దాని తలపై పడింది. నక్క బాధ ఎక్కువైంది. ఒకటికి మూడుచోట్ల నొప్పులయ్యాయి. ఇంతలో తాటికాయల గెల తెగి దీనిమీద పడింది. ఆ దెబ్బకు నక్క యమలోకం ఎంట్రన్స్ దాకా వెళ్లిపోయింది. అంటే కోమా స్టేజ్ అన్నమాట... ఈసారి ఏకంగా తాటిచెట్టే కూలి దాని మీద పడింది. కోమా నుండి బయటపడే పని లేకుండానే నక్క నేరుగా గేట్‌పాస్ తీసుకుని యముడి వద్దకు ఎంట్రీ ఇచ్చింది.*

నెల్లూరుజిల్లాలో రియల్ ఎస్టేట్ పరిస్థితి కూడా ఇంతే! దివంగత నేత వై.యస్.రాజశేఖరరెడ్డి పాలనలో జిల్లాలో రియల్‌ఎస్టేట్ మూడు ఫ్లాట్లు, ఆరు లేఅవుట్లుగా వర్ధిల్లింది. వై.యస్. మరణం నెల్లూరు రియాల్టీ మీద మూలిగే నక్క కంట్లో నలుసు, కాళ్లో ముల్లు అన్నట్లుగా మారింది. ఆ తర్వాత వచ్చిన రాష్ట్ర విభజన ఉద్యమాలతో తాటికాయ పడ్డట్లయ్యింది. 2014 ఎన్నికల్లో వై.యస్.జగన్ కాకుండా చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం, ఆయన రాజధానిని అమరావతిలో పెట్టడంతో నెల్లూరు రియాల్టీపై తాటిగెల పడి కోమాలోకి వెళ్లినట్లయ్యింది. ఇప్పటి దాకా ప్రత్యేకహోదా అనే ఔషధం రాకపోతుందా? కోమాలో వున్న రియల్‌ఎస్టేట్ కోలుకోకుండాపోతుందా? అని ఎదురుచూసారు. కాని ఆ ఔషధం కూడా రాదని తేలిపోయింది. ఇప్పుడు ఏకంగా నరేంద్రమోడీ రూపంలో వచ్చిన యమకింకరుడు కోమాలో వున్న నెల్లూరు రియాల్టీని ఏకంగా పైకి పంపేసాడు. అవును... పెద్ద నోట్ల రద్దుతో నెల్లూరు రియల్‌ఎస్టేట్ పూర్తిగా పడుకుంది. జిల్లాలో వ్యవసాయం తర్వాత రియల్‌ఎస్టేట్ వల్లే ఎంతోమంది ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఉపాధి పొందుతున్నారు. రియల్ ఎస్టేట్ ఆధారంగా ఇంకా ఎన్నో వ్యాపారాలు జరుగుతున్నాయి. రియల్టర్లు, బిల్డర్లు, వడ్డీ వ్యాపారులే కాకుండా, ఏజంట్లుగా ఎంతోమంది బ్రతుకుతున్నారు. ఇక నిర్మాణ రంగంలో చూస్తే భవన నిర్మాణ కూలీలు లక్షల్లో ఉపాధి పొందుతున్నారు. ఇక దీనిమీద ఆధారపడి ఇసుక, ఇటుక, స్టీలు, సిమెంట్, పెయింట్స్, గృహోపకరణాలు, ఫర్నీచర్స్, మార్బుల్స్, టైల్స్, ఎలక్రికల్స్, ఫ్యాబ్రికేషన్... ఇలా ఎన్నో వ్యాపారాలకు రియల్ ఎస్టేట్ మూలస్థంభం. రియల్ రంగం కుదేలైతే ఆ వ్యాపారాలకు దెబ్బే! దీనివల్ల పరోక్షంగా చాలామంది ఉపాధిని కోల్పోయే ప్రమాదముంది. పెద్దనోట్ల రద్దుతో ముఖ్యంగా రియల్‌ఎస్టేట్ లావాదేవీలలో ప్రతిష్టంభన నెలకొంది. బ్లాక్‌మనీ ఎక్కువుగా చెలామణి అయ్యింది ఇప్పటిదాకా రియల్ ఎస్టేట్‌లోనే! ఇప్పుడు పెద్దనోట్లు పూర్తిగా రద్దు చేయడంతో రియల్‌ఎస్టేట్ ధరలు పడిపోయినట్లే! అయితే అప్పు క్రింద నల్లధనం ఇచ్చిన వడ్డీ వ్యాపారులకు ఏం చేయాలో పాలుపోని పరిస్థితి. అదీగాక ఇప్పటిదాకా ఆయా ప్రాంతాల్లో చెలామణిలో వున్న స్థలాల రేట్లకు, ప్రభుత్వ విలువకు చాలా తేడాలొస్తాయి. ఇప్పుడు వాటిని ఏ రూపంలో కొలవాలనేది కూడా సమస్యగా మారింది.

మోడీ ఇచ్చిన షాక్‌తో నెల్లూరు రియల్ ఎస్టేట్ పూర్తిగా దెబ్బతింది. ఈ షాక్‌కు ఎంతమంది బ్రతుకులు బలయ్యాయన్నది త్వరలోనే తెలుస్తుంది.

# నెల్లూరు కబుర్లు

## నెల్లూరుకు నారా లోకేష్



తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఈ నెల 18వ తేదీన నెల్లూరొస్తున్నాడు. ఆరోజు నెల్లూరులోని నారాయణ ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారు. అలాగే నెల్లూరు, గూడూరులలో జరిగే జనచైతన్య యాత్రలలోనూ, పార్టీ కార్యక్రమాలలోనూ పాల్గొంటారు.

### మాగుంట శరత్‌చంద్రారెడ్డి యువజన సేవాసమితి

## చిల్డ్రన్స్ డే



ఈ నెల 14న బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని మాగుంట శరత్ చంద్రారెడ్డి యువజన సేవా సమితి వారు నెల్లూరు, పద్మావతి సెంటర్‌లోని గురుకుల పాఠశాలలో చిన్నారుల చేత కేక్ కట్ చేయించి, వారికి స్టేషనరీ, జామెంట్రీ బాక్సులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాగుంట శరత్ చంద్రారెడ్డి మాట్లాడుతూ నేటి బాలలే రేపటి భారత ఆశాదీపాలని, తమ సేవాసమితి ద్వారా పేద విద్యార్థుల చదువుకు చేతనైనంత సాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సేవాసమితి సభ్యులు లేకిన్‌రెడ్డి, సాయిబాబా, కమతం అశోక్, నిషాద్, సాయికృష్ణ, మనోజ్‌చౌదరి, నాని తదితరులు పాల్గొన్నారు.

## బంగారం కొనేసారు!

పెద్దనోట్ల రద్దు ప్రకటన నల్లధనాన్ని పోగేసిన రాజకీయ నాయకుల గుండెల్లో రైళ్లు పరుగెత్తిస్తోంది. నల్ల ధనాన్ని ఏ రూపంలో నిలుపుకోవాలో తెలియక నాయకులు అనేక మార్గాలను అన్వేషిస్తున్నారు. నెల్లూరుకు చెందిన ఓ నాయకుడు మాత్రం పెద్దనోట్ల రద్దు ప్రకటించిన మరుసటి రోజే చిన్నబజారు, మండపాల వీధిలలోని బంగారం దుకాణాలలో 8కోట్లకు సరిపడా బంగారం కొన్నట్లు తెలుస్తోంది. ఈయన బంగారం కొన్న పక్కరోజే నెల్లూరులో అన్ని బంగారం దుకాణాల మీద సెంట్రల్ ఎక్సైజ్ దాడులు జరగడం విశేషం.

### మాడరన్ స్కూల్లో

## కార్తీక దీపోత్సవం



కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని నెల్లూరులోని మాడరన్ స్కూల్ ఆవరణంలో స్కూలు విద్యార్థినీ విద్యార్థులు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొని దీపోత్సవ సంబరాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. విద్యార్థినీ విద్యార్థులు శివభజనలు, శివ కీర్తనలు ఆలపించి అలరించారు. శివలింగం, స్వస్తిక్, ఓం ఆకారాలతో దీపాలు వెలిగించి కనువిందు చేశారు. మాడరన్ స్కూల్ కరస్పాండెంట్ వాకాటి విజయకుమార్‌రెడ్డి, ప్రిన్సిపల్ రవీంద్రకుమార్ పర్యవేక్షించారు.

## కమాండ్ కంట్రోల్ భేష్



రాష్ట్ర రవాణాశాఖ కమిషనర్ ఎం.బాలసుబ్రహ్మణ్యం 14వ తేదీ నెల్లూరుజిల్లా ఎస్పీ కార్యాలయాన్ని సందర్శించారు. ఎస్పీ విశాల్‌గున్నీ ఆధ్వర్యంలో ఏర్పాటైన కమాండ్ అండ్ కంట్రోల్ సిస్టంను ఆయన పరిశీలించారు. ఈ సిస్టం అమలుపై ఎస్పీకి కొన్ని సూచనలిచ్చారు.

## పెళ్లి డబ్బు పుకార్లే

పెళ్లి కార్డుతో వస్తే బ్యాంకు నుండి 5లక్షల నగదు విత్‌డ్రా చేసుకోవడానికి జిల్లా ఎస్పీ అనుమతినిస్తారని సోషల్ మీడియాలో వస్తున్న వదంతులను నమ్మవద్దని జిల్లా ఎస్పీ విశాల్‌గున్నీ హెచ్చరించారు. రిజర్వ్ బ్యాంకు నుండి అలాంటి ఆదేశాలేమీ లేవని ఆయన విలేకరులకు వెల్లడించారు. అలాగే కమిషన్ మీద నగదు మార్పిడి చేస్తామని చాలామంది దళారులు మధ్యపెట్టాలని చూస్తున్నారని, అలాంటి వారిని నమ్మవద్దని, వారి గురించిన సమాచారం వుంటే తనకు తెలియజేయాలని ఆయన కోరారు. డిసెంబర్ 30వ తేదీలోగా బ్యాంకులో నగదు మార్చుకోవచ్చని, ప్రజలు ఇబ్బంది పడాల్సిందేమీ లేదన్నారు.

## ప్రజలకు చిల్లర కష్టాలు



పెద్ద నోట్ల రద్దును వ్యతిరేకిస్తూ ఏ రాజకీయ నాయకులూ నోరు మెదపడం లేదు. ఏ నాయకుడైనా పెద్దనోట్లు రద్దును వ్యతిరేకిస్తే, ఈయన వద్ద ఎంత బ్లాక్‌మనీ ఉందోనని ప్రజలు భావిస్తారని భయం. కాని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పనబాక కృష్ణయ్య ముందస్తు చర్యలు లేకుండా, సామాన్య ప్రజలను ఇబ్బందులు పాల్జేసేలా ఉన్నఫళంగా పెద్దనోట్లను రద్దు చేయడం అన్యాయమంటూ సోమవారం నెల్లూరు బారకాసు సెంటర్‌లోని భారతీయ స్టేట్ బ్యాంక్ ఎదుట ధర్నా నిర్వహించారు. కొత్తగా జారీ చేసిన 2వేల నోట్లు నాలుక గీసుకోవడానికి కూడా పనికిరావడం లేదని, వెంటనే చిన్ననోట్లను విడుదల చేసి ప్రజలకు చిల్లరకష్టాలను తీర్చాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో పీసీసీ సమన్వయకర్త సి.వి.శేషారెడ్డి, ఉపాధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి పి.చెంచలబాబుయాదవ్, కాంగ్రెస్ నాయకులు భవాని నాగేంద్రప్రసాద్, పత్తి సీతారాంబాబు, గాజుల శివాచారి, కేశవనారాయణ, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

## బాలల దినోత్సవ సంబరాలు











నెల్లూరు మాగుంట లేఅవుట్‌లోని డా॥ కిషోర్స్ రత్నం ఫ్యూచర్ విజన్ పాఠశాలలో సోమవారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో జవహర్‌లాల్ నెహ్రూ జన్మదినాన్ని పురస్కరించుకుని ఫెస్టివల్ ఉత్సవ్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, పాఠశాల ప్రిన్సిపాల్ కళ్యాణి, మేనేజర్ రాధాకృష్ణ, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

నేతాజీ ఫైలట్ హైస్కూలు వారు బాలల దినోత్సవాన్ని టౌన్‌హాలులో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డా॥ సి.ఎస్.శ్రీనివాసరాజు పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తల్లిదండ్రులను గౌరవించాలని, తల్లిదండ్రుల తర్వాత స్థానం గురువుదన్నారు. మనం ఏ స్థాయిలో వున్నా తల్లిదండ్రులను చక్కగా చూడాలన్నారు. సమాజసేవ చేయాలని దేశ సౌభ్రాతృత్వం కోసం పాటుపడాలన్నారు. రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి ఎం.వెంకటాద్రిరెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ ఎం.వి.సుబ్బారెడ్డి, వైస్‌ప్రిన్సిపల్ డి.వాణి, హెడ్‌మాస్టర్ ఎస్‌వివెల్ నరశింహారావు, డ్యాన్స్ మాస్టర్ రాము, పిఇటి రమేష్‌బాబు పాల్గొన్నారు.

నెల్లూరు జాకీర్‌హుస్సేన్ నగర్‌లోని ఎస్‌వీఆర్ ఇంగ్లీషు మీడియం స్కూలులో నెహ్రూ జయంతిని పురస్కరించుకుని బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనలు, విచిత్ర వేషధారణలు, ఆటపాటలు అందరిని అలరించాయి. స్కూలు కరస్పాండెంట్ అందె శ్రీనివాసులు, ప్రిన్సిపల్ బి.రమేష్‌బాబు, స్కూలు డైరెక్టర్ అందె రాము, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నెల్లూరు మాగుంట లే అవుట్‌లోని వేదవ్యాస ఇంగ్లీషు మీడియం హైస్కూల్లో చిల్డ్రన్స్ డేను గ్రీన్‌డేగా నిర్వహించారు. పిల్లలందరూ ఆకుపచ్చ రంగు దుస్తులు ధరించి తమ తరగతి గదులను ఆకుపచ్చ పండ్లు, కూరగాయలు, ఆకుపచ్చ బెలూన్లతో అలంకరించారు. పర్యావరణాన్ని ఎలా కాపాడుకోవాలనే అంశంపై చార్టుల ద్వారా, బొమ్మల ద్వారా వివరించి ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి ఒక చెట్టును నాటి, దానిని కాపాడాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్కూలు కరస్పాండెంట్ ఏ.పి.బాలాజీ, డైరెక్టర్ ఏ.పి.వేదగిరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నెల్లూరు, ఆదిత్యనగర్‌లోని కిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్లో చిల్డ్రన్స్‌డే సందర్భంగా విద్యార్థులు వివిధ వేషధారణలలో అలరించారు. ఈ సందర్భంగా ఎల్ అండ్ టి కంపెనీ మరియు కిడ్జ్ స్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి స్కూలు ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం స్కూలు విద్యార్థులకు మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కిడ్జ్ స్కూల్ కో-ఆర్డినేటర్ అర్చనసింగ్, బి.నాగమల్లేష్, జి.ప్రశాంతి, స్కూలు సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు మనుమసిద్ధినగర్‌లోని తీర్ధ చిల్డ్రన్స్ హోం స్కూల్లో బాలల దినోత్సవం సందర్భంగా చిన్నారులు ఆటపాటలతో, విచిత్ర వేషధారణలతో అలరించారు. స్కూలు ప్రిన్సిపల్ ఎం.సాయికుమారి, స్కూల్ ఇన్‌ఛార్జి బి.శ్రీనివాసులు పాల్గొని నెహ్రూ జీవితచరిత్రను గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేశారు.

## షుగర్ వ్యాధిపై అవగాహన సదస్సు



ప్రపంచ డయాబెటిక్ డే సందర్భంగా సోమవారం నెల్లూరు ఏసి సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ డయాబెటిక్, ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ ఎ.వి.మోహన్‌రావు షుగర్ వ్యాధి గురించి అవగాహన కల్పించారు. షుగర్ రాకుండా తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం వాకర్స్ సందేహాలను నివృత్తి చేశారు. అధ్యక్షుడు వేలూరు రంగారావు, కార్యదర్శి స్వర్ణ రమేష్‌బాబు, డా॥ అంకిరెడ్డి, శ్రీనివాసకుమార్, ఎస్.రాఘవేంద్రషెట్టి, ఓబుల్‌రెడ్డి, హరిరావు, నారాయణరావు, సభ్యులు పాల్గొన్నారు.



రోలర్ స్కేటింగ్ పోటీలలో ఒక బంగారు, ఒక వెండి పతకం సాధించి గుంటూరు, విశాఖపట్నంలో జరిగే రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలకు ఎంపికైన నెల్లూరు మాగుంట లేఅవుట్‌లోని వేదవ్యాస స్కూలు విద్యార్థిని పొనుగోటి యశస్వినిని సత్కరిస్తున్న తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి డా॥ జడ్.శివప్రసాద్, జిల్లా రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ప్రతినిధులు



## నాణ్యమైన విద్యతో...
# పునాదులు నిర్మించాలి

### 'మార్గదర్శిని' పుస్తకావిష్కరణలో కలెక్టర్ రాజు

మొదటి నుంచి నాణ్యమైన విద్యాబోధనతో పునాదులు నిర్మించుకోవాలని నెల్లూరుజిల్లా కలెక్టర్ ముత్యాలరాజు పేర్కొన్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని నెల్లూరు జడ్పీ సమావేశమందిరంలో ప్రభుత్వ రంగ పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా అందజేసేందుకు ప్రత్యేకంగా రూపొందించిన స్టడీమెటీరియల్ 'మార్గదర్శిని' సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రైవేటు విద్యా సంస్థలతో పోలిస్తే ప్రభుత్వ పాఠశాలల్లోనే ప్రతిభ గల ఉపాధ్యాయులు ఉన్నారని తెలిపారు. స్టడీ మెటీరియల్‌ను రాబోయే విద్యా సంవత్సరానికి సైతం ఉపయోగించేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యా సంవత్సరం ఆఖరిరోజున స్టడీ మెటీరియల్‌ను స్కూల్‌లో వుంచి పైతరగతులకు వచ్చేవారికి అందజేయాలన్నారు.

నెల్లూరు జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ డిఇఓ, ఎంఇఓలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు విద్యార్థి ప్రగతిని పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఒకే ప్రశ్నాపత్రంతో నెలనెలా పరీక్షలు నిర్వహించి ఫలితాలను నెట్‌లో ఉంచాలని సూచించారు. జడ్పీ నుంచి రూ.20లక్షలు కలెక్టర్ సహకారంతో మరో రూ.20లక్షలు వెచ్చించడం వల్ల విద్యార్థుల కోసం తలపెట్టిన ఈ బృహత్తర కార్యక్రమం విజయవంతమైందన్నారు. పాఠశాలలోనే ఇంటర్ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టాలని సూచించారు. ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ జిల్లాలో రూపొందిస్తున్న 'మార్గదర్శిని' స్టడీమెటీరియల్ రాష్ట్రంలో మరెక్కడా లేదన్నారు. డిఇఓ మువ్వా రామలింగం, ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, జడ్పి సిఇఓ రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్టడీమెటీరియల్ రూపకల్పనలో కృషి చేసిన సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్‌కు అభినందనపత్రాలను అందజేశారు.

## వారసత్వంతో కాదు...
# జవసత్వంతో ఎదగాలి!


- కేంద్రమంత్రి యం.వెంకయ్యనాయుడు






వారసత్వంతో కాకుండా జవసత్వంతో కష్టపడితే ఎంతటి ఉన్నత స్థానానికైనా వెళ్లొచ్చని కేంద్రమంత్రి యం.వెంకయ్య నాయుడు పేర్కొన్నారు. ఈ నెల 13వ తేదీన నెల్లూరు, కనుపర్తి పాడులోని విపిఆర్ కన్వెన్షన్‌సెంటర్‌లో విపిఆర్ ఫౌండేషన్, స్వర్ణభారత్ ట్రస్ట్ సంయుక్తంగా విద్యార్థులతో ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడుతూ ఇంటింటికి పేపర్ వేసి కష్టపడి రాష్ట్రపతిగా పనిచేసిన అబ్దుల్‌కలాం, టీ అమ్ముకునే స్థాయి నుండి కష్టంతో ప్రధాని స్థాయికి ఎదిగిన నరేంద్ర మోడీ మనకు ఈ విషయంలో ఆదర్శప్రాయులన్నారు. ప్రపంచ దేశాలన్నీ భారత్ వైపు చూస్తున్నాయని, ఏ దేశంలో లేని యువ సంపద భారతదేశం లోనే ఉందని, 60% మంది యువతే మన దేశానికి వెన్నెముకని ఆయన పేర్కొన్నారు. యువత పెడద్రోవ పట్టకుండా సన్మార్గంలో నడిచి దేశాన్ని ముందుకు నడిపించాలన్నారు. భారతదేశంలో ఖనిజాలకు, మానవ వనరులకు ఎప్పుడూ లోటు లేదు. మంచి సంపదతో పాటు మంచి సంస్కృతి వున్న దేశంలో మనం పుట్టాం. పూర్వకాలంలోనే కాదు, పురాణకాలంలోనూ భారత్‌కు గొప్ప చరిత్ర వుంది. బ్రిటీష్ వాడు పోతూపోతూ కొన్ని జాడ్యాలను మనకు అంటించి వెళ్లాడు. కొందరు పాలకులు ఆ జాడ్యంలోనే మనల్ని వుంచారు. ఆ జాడ్యం నుండి దేశాన్ని తప్పించేందుకు కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని ఆయన పేర్కొన్నారు. క్రమశిక్షణ, కష్టపడే తత్వం వల్లే చిన్న దేశమైనా కూడా ఇజ్రాయిల్ ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. కేంద్రప్రభుత్వం మేక్ ఇండియా, స్కిల్ ఇండియా, క్లీన్ ఇండియా, డిజిటల్ ఇండియా అనే నినాదాలతో ముందుకు సాగుతుందని ఈ సందర్భంగా తెలిపారు. స్త్రీలను గౌరవించు కోవాల్సిన అవసరం ఎంతైనా వుందని మన పురాణ ఇతిహాసాలలో స్త్రీలకు పెద్దపీట వేశారని, ధనం అంటే లక్ష్మీదేవిగా, విద్యాదేవిగా సరస్వతి దేవి, రక్షణకు పార్వతీదేవిగా గుర్తింపు పొందివున్నారని, అదే విధంగా నదులకు గంగా, యమున, సరస్వతి, నర్మద, తపతి ఇటువంటి పేర్లన్నీ ఆది నుండి స్త్రీలకే వశమై వున్నాయని, అటువంటి స్త్రీని గౌరవించుకోవడంలో భాగంగా భేటీ బచావ్, భేటీ పడావ్ అంటే స్త్రీలను రక్షించుకోవడం, వారిని చదివించుకొని ప్రయోజకులను చేయడం ముఖ్య ఉద్దేశ్యమని, స్త్రీ పురుష నిష్పత్తిని కూడా సమాన స్థాయిలో చేసుకోవాల్సిన అవసరం వుందన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి డా॥ పొంగూరు నారాయణ, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్, వ్యవసాయ శాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, శాసనమండలి సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వాకాటి నారాయణరెడ్డి, శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ, జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ విశాల్‌గున్నీ, స్వర్ణభారత్ ట్రస్ట్ ట్రస్టీ దీపావెంకట్, విపిఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



## సుప్రసిద్ధ కవి డా. రావి రంగారావుకు
# ప్రతిష్టాత్మక డా. నాగభైరవ అవార్డు

### • డిసెంబర్ 18న పురస్కార ప్రదానోత్సవం



డా. రావి రంగారావు

ప్రముఖ కవి, యువతకు విద్యార్థులకు స్ఫూర్తిప్రదాత కీర్తిశేషులు డా. నాగభైరవ కోటేశ్వరరావు స్మారకంగా ప్రదానం చేసే 8వ సాహితీ పురస్కారం-2016ను ఈ ఏడాది విలక్షణ కవి, మినీకవితా పితా మహుడు, ప్రఖ్యాత సాహితీవేత్త డా.రావి రంగారావుకు ప్రదానం చేయనున్నారు. ఆ మేరకు నెల్లూరులోని డా.నాగభైరవ అవార్డు కమిటీ ప్రధాన కార్యదర్శి ప్రముఖ కవి చిన్ని నారాయణరావు ఒక ప్రకటనలో ఆ వివరాలు తెలియజేశారు.

మచిలీపట్నంలోని ఆంధ్ర జాతీయ బిఇడి కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డా. రావి రంగారావు గత నాలుగు దశాబ్దాలుగా తెలుగు సాహిత్య వికాసానికి ఎంతో కృషి చేశారని వారు పేర్కొన్నారు. ముఖ్యంగా యువకవితా రంగంలో చైతన్యదీపికలు వెలిగించారని, ప్రత్యేకించి మినీ కవిత్వాన్ని ఒక ఉద్యమంగా ప్రజల్లోకి తీసుకువెళ్లిన ఘనత డా. రావి రంగారావుదేనని పేర్కొన్నారు. కాగా, ఎంతో విశిష్టమైన డా.నాగభైరవ అవార్డు కింద డా. రావి రంగారావుకు 10వేల నగదుతో పాటు, ఘన సత్కారం వుంటుందన్నారు. నెల్లూరులోని టౌన్‌హాలులో డిసెంబర్ 18వ తేది (ఆదివారం) సాయంత్రం జరిగే ఈ అవార్డు సభకు ఆంధ్రప్రదేశ్ శాసనసభ డిప్యూటి స్పీకర్ మండలి బుద్ధప్రసాద్ పాల్గొని డా. రావి రంగారావుకు నాగభైరవ అవార్డు పురస్కారం అందజేస్తారని, ఈ సభకు సినీకవి వెన్నెలకంటి రాజేశ్వరప్రసాద్ అధ్యక్షత వహిస్తారని వివరించారు.

గత ఏడు సంవత్సరాలుగా ఈ అవార్డును ప్రముఖ సాహితీ వేత్తలకు అందజేశామని, నాగభైరవ అవార్డు అందుకున్న వారిలో కీర్తిశేషులు మల్లెమాల, ప్రముఖ కవులు దర్భశయనం శ్రీనివాసాచార్య, రసరాజు, ప్రముఖ సినీ నటుడు, కవి తనికెళ్ళ భరణి, కీర్తిశేషులు అద్దేపల్లి రామ్మోహనరావు, ప్రఖ్యాత సినీకవి సుద్దాల అశోక్‌తేజ, ప్రముఖ సినీనటుడు - రచయిత గొల్లపూడి మారుతీరావు వున్నారని వారు పేర్కొన్నారు. కాగా, డా. నాగభైరవ కోటేశ్వరరావు అధ్యాపకులుగా ఎంతోమందిని తీర్చిదిద్దారని, అందుకు గుర్తింపుగా నాగభైరవ ఉత్తమ అధ్యాపక అవార్డును తూమాటి సంజీవరావు (చెన్నై) మార్గదర్శనంలో నెల్లూరుకు చెందిన అధ్యాపకుడు, ప్రముఖ కవి పచ్చిపులుసు వెంకటేశ్వర్లుకు ప్రదానం చేస్తున్నామని వారు తెలిపారు.

### అయిదుగురికి నాగభైరవ స్ఫూర్తి అవార్డులు:

డా.నాగభైరవ కోటేశ్వరరావు స్ఫూర్తితో ప్రతి ఏటా ఇచ్చే నాగభైరవ స్ఫూర్తి అవార్డులను అదే రోజున నెల్లూరుకు చెందిన ప్రముఖ కవులు మద్దూరు శ్రీనివాసులు('లాయర్' వారపత్రిక ఉపసంపాదకుడు), ఈతకోట సుబ్బారావు, చెన్నైకి చెందిన డా. కాసల నాగభూషణం, కె.విల్సన్‌రావు (హైదరా బాద్), శ్రీమతి పాలపర్తి జ్యోతిష్మతి(అద్దంకి)లకు ప్రదానం చేస్తున్నామన్నారు. వీరికి నగదు పురస్కారంతోపాటు, శాలువా- జ్ఞాపిక అందజేయ నున్నామని చిన్ని నారాయణరావు పేర్కొన్నారు.

వచ్చే నెల 18న టౌన్‌హాలులో ఎంతో ఘనంగా జరిగే ఈ సభలో కవులు, కళాకారులు, సాహితీవేత్తలు, సాహిత్యాభి మానులు, డా.నాగభైరవ కోటేశ్వరరావు శిష్యులు, అభిమానులు అందరూ విచ్చేసి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.

# బ్లాక్‌లో ఉప్పు అమ్మితే తుప్పు వదిలిస్తాం

### జాయింట్ కలెక్టర్ ఎండి ఇంతియాజ్



జిల్లాలో నిత్యావసర వస్తువుల్లో భాగంగా వున్న ఉప్పును ప్రభుత్వ ధరకంటే ఎక్కువ ధరకు అమ్మితే సంబంధిత వారిపై చట్టపరమైన కఠినచర్యలు తీసుకోవడం జరుగుతుందని జాయింట్ కలెక్టర్ ఎండి ఇంతియాజ్ పేర్కొన్నారు. సోమవారం నెల్లూరు జేసీ ఛాంబర్లో జిల్లాలో వున్న ఉప్పు వినియోగం మరియు నిల్వలకు సంబంధించిన సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఎలాంటి ఉప్పుకొరత లేదని, నిల్వలు ఎక్కువ మొత్తంలో వున్నాయని, ఎక్కడైనా ఉప్పును 'బ్లాక్ మార్కెట్'లో అమ్మినట్లు తెలిస్తే సంబంధిత వారిపై లీగల్ యాక్ట్ ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ ప్రక్రియలో లీగల్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు, మార్కెటింగ్, పౌరసరఫరాలు మరియు పోలీసు అధికారుల సమన్వయంతో సమగ్ర తనిఖీలు నిర్వహించి, నిత్యావసర వస్తువులు, ఉప్పును అధిక ధరకు అమ్మకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు ఆందోళన పడాల్సిన అవసరం లేదన్నారు.

ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి ధర్మారెడ్డి, జిల్లా మేనేజర్ కొండయ్య, సాల్ట్ డిప్యూటి సూపరింటెండెంట్ ప్రభాకర్‌రావు, గెజిటెడ్ ఫుడ్ ఇన్స్‌పెక్టర్ ఆనందరావు, లీగల్ మెట్రాలజీ, కార్మికశాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.




# కల్యాణ వైభవం...!



నారాయణ హాస్పిటల్స్ ఏ.జి.ఎం చౌకచర్ల భాస్కర్‌రెడ్డి - ప్రవీణల కుమారుడు
**లేఖర్ష్‌రెడ్డి - డాక్టర్ సుస్మితారెడ్డి** (నెల్లూరు వాస్తవ్యులు దువ్వూరు శ్రీధర్‌రెడ్డి - కుసుమల కుమార్తె)ల
వివాహం ఈ నెల 13వ తేదీ నెల్లూరులోని అనిల్ గార్డెన్స్ నందు జరిగింది.
కొత్త జంటకు 'లాయర్' శుభదీవెనలు.



నెల్లూరు వాస్తవ్యులు వీరిశెట్టి వెంకట సుబ్రహ్మణ్యం - కళ్యాణిల కుమార్తె
**మనస్విని - సాయికృష్ణ** (ఒంగోలు వాస్తవ్యులు గుర్రంకొండ దుర్గాకోటేశ్వరప్రసాద్ - సరళకుమారిల
కుమారుడు)ల కళ్యాణం ఈ నెల 16వ తేదీ నెల్లూరులోని మహేశ్వరి కళ్యాణ మండపం నందు జరిగింది.
నూతన దంపతులకు 'లాయర్' శుభాశీస్సులు.



కలువాయి మండల ప్రజాపరిషత్ ఉపాధ్యక్షులు మాకిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి - ప్రమీలల కుమార్తె
**సాయి ప్రవల్లిక - నవీన్‌రెడ్డి** (రాపూరు మండలం సైదాదుపల్లి వాస్తవ్యులు గడ్డం గోపాలరెడ్డి - అరుణల
కుమారుడు)ల పెళ్లి ఈ నెల 16న నెల్లూరులోని అనిల్ గార్డెన్స్ నందు జరిగింది.
నూతన జంటకు 'లాయర్' శుభాభినందనలు.



గూడూరు వాస్తవ్యులు బండి శ్యామసుందరరావు(మయూరి శ్యామ్ యాదవ్) - మహేశ్వరిల కుమార్తె
**అక్షర(గ్రీష్మ) - అవినాష్** (నెల్లూరు వాస్తవ్యులు కాకు సత్యనారాయణరావు - కృష్ణవేణిల కుమారుడు)ల
పరిణయంఈ నెల 13వ తేదీ నెల్లూరు పి.వి.ఆర్.కళ్యాణ మండపం నందు, రిసెప్షన్ బి.ఎం.కన్వెన్షన్ హాల్ నందు
వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమాలకు టిడిపి జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర, బీద మస్తాన్‌రావు,
ఎమ్మెల్యేలు అనిల్‌కుమార్‌యాదవ్, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పాశం సునీల్‌కుమార్, గూడూరు మున్సిపల్
ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన, తానంకి నానాజీ హాజరయ్యారు. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.



# గూడూరు డివిజన్ వార్తలు

## రక్తదానంతో ప్రాణదాతలు కండి

**- ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన**



రక్తదాతలను అభినందిస్తున్న ఛైర్‌పర్సన్ దేవసేన

గూడూరు పట్టణంలోని జిఎస్ఆర్ మున్సిపల్ పాఠశాలలో బాలల దినోత్సవం సందర్భంగా సోమవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. 55మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి రక్తం ఇచ్చిన వారు ప్రాణదాతలతో సమానమని అన్నారు. ఈ కార్యక్రమంలో సమన్వయకర్త వెంకటసుబ్బయ్య, కౌన్సిలర్ బిల్లు చెంచురామయ్య, శ్రీనివాసులు, కడివేటి చంద్రశేఖర్, మునిగిరీష్, ప్రధానోపాధ్యాయులు మున్వర్‌బాషా, ఉపాధ్యాయులు, రక్తదాతలు తదితరులు పాల్గొన్నారు.

## పోటుపాళెంరోడ్డులో రవాణాశాఖ కార్యాలయం



ఆర్టీవో కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఆర్టీవో చందర్

గూడూరు పోటుపాళెంరోడ్డులో రవాణాశాఖ కార్యాలయాన్ని ఆర్టీవో చందర్ సోమవారం ప్రారంభించారు. ఇంతకు ముందు ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో వున్న రవాణాశాఖ కార్యాలయాన్ని పోటుపాళెంరోడ్డుకు మార్చారు. గత వర్షాకాలంలో పాత ఆఫీసులో నీళ్లు రావడంతో పూర్తిగా ఆఫీసు మునిగిపోవడంతో ప్రజలకు జరిగిన ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆఫీసు మార్చినట్లు ఆర్టీవో చందర్ తెలిపారు. ప్రజలు అందరూ పోటుపాళెంరోడ్డులో వున్న రవాణాశాఖ కార్యాలయానికి వచ్చి తమ సేవలు పొందగలరని అన్నారు. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ కరుణాకర్, జకీర్, జయరాం, గూడల సౌజన్య, ఏవో మద్దాని తదితరులు పాల్గొన్నారు.

## బాలసదన్‌లో దోమతెరలు, బకెట్ల పంపిణీ



దోమతెరలు, బకెట్లు పంపిణీ చేస్తున్న వై.చలపతిరావు

గూడూరు నరసింగరావుపేటలోని బాలసదన్‌లో కీర్తిశేషులు యరగుడిపాటి యాదవతి 84వ జయంతిని ఆయన కుమారుడు, సీనియర్ న్యాయవాది, గూడూరు బ్రాహ్మణ సేవాసంఘం అధ్యక్షుడు యరగుడిపాటి చలపతిరావు సోమవారం ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా బాలసదన్‌లోని బాలబాలికలకు వారి అమ్మ జ్ఞాపకార్థం దోమతెరలు, బకెట్లు ఇవ్వడం జరిగింది. చలపతిరావు తల్లి యొక్క ప్రాముఖ్యతను, నెహ్రూ జయంతిని మరియు డయాబిటిక్ దినోత్సవం తదితర విషయాల గురించి వివరించారు. పైసభలో వార్డెన్, న్యాయవాదులు రజనీకాంత్‌రెడ్డి, బద్దల తిరుమలేశు, లయన్ నవీన్ జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ఎంఎఫ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో

## విందూరు ఉన్నత పాఠశాలకు ఫ్యాన్లు



విద్యార్థినికి బహుమతి అందిస్తున్న రియాజ్ అహ్మద్

మౌలానా ఆజాద్ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 11వ తేదీ జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా ఎంఎఫ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విందూరు ఉన్నత పాఠశాలకు ఫ్యాన్లు బహుకరించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ విద్యతోనే పేదరికం జయించడంతో పాటుగా జీవితాల్లో వెలుగులు నింపుతాయని అన్నారు. మహమ్మదీయన్ వెల్ఫేర్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు పద్మ, సర్పంచ్ మల్లికార్జునరెడ్డి, ఉపాధ్యాయులు శివకుమారి తదితరులు పాల్గొన్నారు.

### మేషం



అశ్వని, భరణి, కృత్తిక 1 పాదము

ఉద్యోగ ప్రయత్నం ఫలించగలదు. విలాస వస్తువులు సమకూర్చుకుంటారు. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. అధికారుల వల్ల వత్తిడి, పని భారం ఉద్యోగులకు తప్పనిసరిగా ఉంటుంది. అర్థికాభివృద్ధి పథకాలు కార్యరూపం దాల్చగలవు. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి ఆదాయం బాగుంటుంది. చేపట్టిన పనులు నిదానంగా సాగుతాయి. హామీలివ్వడం తగదు.

### కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

వృత్తి వ్యాపారాలలో అనుకూలత, కొత్త వస్తువులను సమకూర్చుకోవడం, దూరప్రయాణాలుండటం, తీర్థ క్షేత్ర సందర్శన కలుగుతుంది. ఆత్మీయుల నుండి మంచి వార్తలు వింటారు. శాస్త్ర సాంకేతిక క్రీడా కళా రంగాల వారికి అవకాశాలు బాగుండును. వ్యాపకాలను పెంచు కొంటూ పోతారు. అందుచే పని భారం పెరిగి టెన్షన్ పడుతుంటారు. ఆదాయం పెరుగుతుంది.

### వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

నిరుద్యోగులకు చిరు అవకాశాలు లభించగలవు. ఉద్యోగులకు అధికారులకు పనిభారం పెరుగుతుంది. కోర్టు వ్యవహారాలు వాయిదా పడగలవు. బాకీల వత్తిడి పెరుగుతుంది. అనవసర విషయాలకు దూరంగా ఉండండి. దూకుడుగా మాటల తీరు, నిర్ణయాల వల్ల ఇబ్బందులు పడతారు. వృత్తి ఉపాధి రంగాల వారికి ఆర్థికస్థితి బాగుంటుంది.

### వృషభం



కృత్తిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

కొత్త కాంట్రాక్టులు, లీజులు లభ్యం కాగలవు. ఉద్యోగ ప్రయత్నాల్లో అనుకూలత ఉంటుంది. స్థిరాస్తుల లావాదేవీలు, కొత్త పెట్టుబడులకు ప్రయత్నాలు జరుపుతారు. శుభకార్య ప్రయత్నాలలో అనుకూలత, దైవ కార్యక్రమాలలో పాల్గొనడం, దూరప్రయాణాలుంటాయి. సంప్రదింపులు, కమిటి మీటింగులలో ప్రాముఖ్యత పొందుతారు. ఆదాయం సామాన్యం.



### బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 18.11.2016 నుండి
తేది. 24.11.2016 వరకు

ఈ వారము మిధున కర్కాటక సింహ కన్య రాశులలో చంద్రుడు, సింహంలో రాహువు, కన్యలో గురువు, వృశ్చికంలో రవి శని బుధులు, ధనుస్సులో శుక్రుడు, కుంభంలో కేతువు సంచరిస్తారు.

**పంచాంగము:**

తేది 24 గురువారము ఉదయం 8.10 నుండి గంట 10.10లోగా ధనుర్లగ్నమున వ్యాపార వివాహ గృహారంభములు.

**కార్తీక మాస కృష్ణపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 18 | శుక్ర | చతుర్థి | ఉ॥ గం.11.03వ॥ |
| తేది. 19 | శని | పంచమి | ఉ॥ గం.9.25వ॥ |
| తేది. 20 | ఆది | షష్ఠి | ఉ॥ గం.8.06వ॥ |
| తేది. 21 | సోమ | సప్తమి | ఉ॥ గం.7.14వ॥ |
| తేది. 22 | మంగళ | అష్టమి | ఉ॥ గం.6.51వ॥ |
| తేది. 23 | బుధ | నవమి | ఉ॥ గం.6.57వ॥ |
| తేది. 24 | గురు | దశమి | రా॥ గం.7.31వ॥ |

### ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

ఉద్యోగులకు అదనపు బాధ్యతలు, క్యాంపులుంటాయి. సమావేశాలు, సభలందు మీ సూచనలకు ప్రాధాన్యత ఉంటుంది. కోర్టు వ్యవహారాలు వాయిదా పడతాయి. స్థిరాస్తుల లావాదేవీలను వాయిదా వేసుకొనడం మంచిది. గాయాలు తగలకుండా చూచుకొనండి. ఆరోగ్యం ఫరవాలేదు. కుటుంబ విషయాలు, శుభకార్య విషయాలపై దృష్టిపెడతారు.

### మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలు లభించగలవు. ఉద్యోగ జీవనం బాగుండి అధికారులతో సఖ్యత బాగుంటుంది. వివాదాల జోలికి పోవద్దు. ఆరోగ్యం బాగుంటుంది. కుటుంబ సౌఖ్యం బాగుండి. శుభకార్యాలందు అనుకూలత ఉంటుంది. వ్యాపారాలలో అభివృద్ధి అనుభవం పొందుతారు. ఆదాయం బాగుంటుంది. వృత్తి ఉపాధి పథకాలలో రాబడి బాగుంటుంది.

### మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

పెండింగ్ సమస్యలు పరిష్కారానికి రాగలవు. నిరుద్యోగులకు అవకాశాలు దొరకడం, ఉద్యోగులపై ప్రత్యేక బాధ్యతలు ఏర్పడతాయి. శాస్త్ర సాంకేతిక రంగాల వారికి కళా క్రీడా రంగాల వారికి అవకాశాలు అందుతాయి. మీ మాట, నిర్ణయాలు చెల్లుబాటు కాగలవు. మంచి పనులకు డబ్బు సహాయం చేస్తారు. ప్రయాణ ఫలితాలు అనుకూలిస్తాయి. ఆర్థికంగా బలపడతారు.

### కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

ప్రముఖులను కలుసుకునే అవకాశాలు రావచ్చును. కుటుంబ సౌఖ్యముంటుంది. కొత్త వస్తువులు, గృహోపకరణములు కొంటారు. ఉద్యోగ ప్రయత్నాలలో అవకాశాలు దొరుకుతాయి. వివాహ ప్రయత్నాలలో ముందుకు సాగుతారు. బంధుమిత్రుల సహకారంతో పనులు జరుపుకొంటారు. ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు తీసుకొనండి. ఆర్థిక సమస్యలు క్రమంగా సర్దుబాటు కాగలవు.

### కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

పెండింగ్ పనులను రాజీమార్గంలో పరిష్కారం జరపాలి. వాణిజ్య ఒప్పందాలు, ఆర్థిక వ్యవహారాలలో జాగ్రత్త అవసరం. పనులు నిదానంగా జరుగుతాయి. అయిన వాళ్ళు, మిత్రులు మీకు సహాయపడతారు. ఉద్యోగ ప్రయత్నాల్లో అవకాశాలు బాగుంటాయి. ఆరోగ్యం బాగుంటుంది. వృత్తి ఉపాధి పథకాలలో ఆదాయం బాగుండినా అసంతృప్తి ఉంటుంది. వ్యాపార అవకాశాలు సరిగా ఉండవు.

### సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

ఆదాయ వ్యయాలు సరిపోతూ సంతృప్తినిస్తాయి. ఉద్యోగులకు అధికారులతో సత్సంబంధాలుంటాయి. పిల్లల వల్ల సమస్యలు రావచ్చును. అనుకున్న పనులు సాఫీగా జరుగుతాయి. అనుకోని ప్రయాణాలుండటం, బంధువులను కలుసుకొనడం జరుగుతుంది. ఆరోగ్యం ఫరవాలేదు. వ్యాపార రంగాల వారు పోటీలను సమర్థవంతంగా ఎదుర్కొంటారు.

### తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

హామీలు, రాయబారాలు మానడం మంచిది. ఆర్థిక ఒప్పందాలలో, స్థిరాస్తుల విక్రయాలలో తొందరపడకండి. అనుకున్న పనులకు ఆటంకాల వల్ల నిదానంగా జరుగుతాయి. ఉద్యోగులు అధికారులతో చేరువకాగలరు. ప్రభుత్వ అనుమతులందు ఆలస్యం ఉంటుంది. ఈ వారం కొన్ని అనవసర ఖర్చులు పైనబడగలవు. వృత్తి ఉపాధి రంగాల వారికి రాబడి కొంత మేలుగా ఉంటుంది.

### మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ఆరోగ్య పరిరక్షణ అవసరం. బంధుముఖ్యులను కలుసుకొంటారు. అనుకున్న పనులు నిదానంగా సాగుతాయి. షేర్లు, పెట్టుబడులపై లాభాలుంటాయి. ఉద్యోగులకు పనిభారం పెరిగినా అధికారుల సహకారం బాగుంటుంది. కుటుంబసౌఖ్యముంటుంది. పెట్టుబడులు వ్యాపార విస్తరణకు అనుకూలంగా ఉంటుంది. వృత్తి వ్యాపారాలలో ఆదాయం బాగుంటుంది.

# బీచ్‌ఫెస్టివల్‌లో బిత్తరపోయిన బీజేపీ నేతలు

శ్రీను గల్పిక

**జరిగిన కథ : ఫిబ్రవరి నెలలో విశాఖలో బీచ్‌ఫెస్టివల్ నిర్వహించాలనుకున్న హైటెక్‌రత్న చంద్రబాబు, అతని మంత్రి వర్గ సభ్యులు ఢిల్లీ వెళ్లారు. బీచ్‌ఫెస్టివల్‌కు రావాలని ప్రధాని నరేంద్రమోడీతో పాటు కేంద్రమంత్రులందరినీ ఆహ్వానిస్తారు. బీచ్‌ఫెస్టివల్ అంటే హైందవ సాంప్రదాయం ప్రకారం జరిగే పండుగేమోనని వారంతా కూడా సాగరతీరం పండుగకు రావడానికి సంతోషంగా ఒప్పుకుంటారు. చివరగా అద్వానీని పిలవడానికి వెళ్లినప్పుడు... ఆయన దేశంలోని వివిధ పీఠాధిపతులు వస్తున్నారా అని ప్రశ్నిస్తే, చంద్రబాబు, మంత్రులు వివిధ దేశాల నుండి వస్తున్న మోడల్స్ పేర్లు చెబుతారు. వాళ్లంతా వివిధ దేశాలకు చెందిన ఆధ్యాత్మిక వేత్తలేమోనని అద్వానీ మనసులో అనుకుంటాడు. చంద్రబాబు టీమ్ ఆహ్వానాల పని పూర్తి చేసుకుని అమరావతికి బయలుదేరుతుంది. ఆ తర్వాత....**

కేంద్రమంత్రి వెంకయ్యానాయుడు బీచ్ ఫెస్టివల్ ఆహ్వానపత్రికను తీసుకుని ఇంటికెళతాడు. రాత్రి నిద్రపోయేటప్పుడు ఆ కార్డును ముఖం మీద పెట్టుకుని నిద్రలోకి జారుకుంటాడు.

★★★★★

అది విశాఖ సాగరతీరం. తీరం అంతా కోలాహలంగా వుంది. విశాఖ ఎయిర్‌పోర్టులో అప్పుడే ఢిల్లీ నుండి వచ్చిన ప్రత్యేక విమానం దిగింది. అందులో నుండి నరేంద్రమోడీ, అద్వానీ, వెంకయ్యానాయుడు, రాజ్‌నాథ్‌సింగ్, మనోహర్‌పారికర్, సుష్మాస్వరాజ్, స్మృతి ఇరాని, సురేష్‌ప్రభు, అమిత్‌షా, శివరాజ్ సింగ్ చౌహాన్, రమణ్‌సింగ్ వంటి బీజేపీ పెద్దలంతా దిగారు. అందరూ సాంప్రదాయ దుస్తుల్లో వున్నారు. అందరి చేతుల్లోను పల్లేలు, వాటిలో కొబ్బరికాయ, పండ్లు, పూలు, పసుపు, కుంకుమలు వున్నాయి. బీజేపీ నేతలను ఆహ్వానించడానికి అక్కడకు వెళ్లిన మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు... వారి డ్రెస్‌లను, వారి చేతుల్లో వున్న పల్లేలను చూసి ఆశ్చర్యంతో... మీరు బీచ్ ఫెస్టివల్‌కు వచ్చారా? సింహాచలం అప్పన్నను దర్శించుకోవడానికి వచ్చారా...? అని అడిగాడు. అందుకు అద్వానీ... మేం బీచ్ ఫెస్టివల్‌కే వచ్చామన్నాడు. అందుకు అయ్యన్నపాత్రుడు... బీచ్‌ఫెస్టివల్‌కు వస్తే ఈ డ్రస్‌లేంటి... ఈ పసుపు కుంకుమలేంటి... ఏదో జాతర కొచ్చినట్లు అని అడిగాడు. వెంకయ్య వుండి... జరిగేది సాగరతీరం పండుగ కదా... గంగమ్మకు సారె తెచ్చామన్నాడు. అప్పుడు అయ్యన్నపాత్రుడు మనసులో... మా చంద్రబాబు బీచ్‌ఫెస్టివల్‌ను మీకు ఇంకో కోణంలో చెప్పినట్లున్నాడు. నాకెందుకొచ్చిన తలనొప్పిలే... అక్కడకొస్తే మీకే అర్థమవుతుందిగా అని అనుకుంటూ వారిని కార్లలో ఎక్కించుకుని కాన్వాయ్‌గా బీచ్ వద్దకు వెళ్లాడు. బీచ్ సమీపంలో దిగిన బీజేపీ నేతలు చేతుల్లో పల్లేలతో ముందుకు కదిలారు. చంద్రబాబు తమకు మంగళవాయిద్యాలతో స్వాగతం పలుకుతాడని వూహించిన వెంకయ్య చుట్టూ చూసాడు. ఎక్కడా అలాంటి వాతావరణం కనిపించలేదు. దూరంగా కొంతమంది మాత్రం వెస్ట్రన్ మ్యూజిక్‌లో మునిగిపోయి వున్నారు. వీళ్లు తీరం వైపు పోబోతుండగా మెయిన్‌గేటు వద్ద సెక్యూరిటీ ఆపేసి... ఈ డ్రెస్‌లతో లోపలకు పోనీయమని చెప్పారు. వెంకయ్య వుండి... మా డ్రెస్‌లకేం... అన్నీ సాంప్రదాయంగానే వున్నాయి కదా అని అడిగాడు. అందుకు సెక్యూరిటీ చీఫ్... ఇలాంటి సాంప్రదాయ దుస్తుల్లో వున్న వారికి ప్రవేశం లేదు. మగవాడైతే బనీను, డ్రాయర్, ఆడవారైతే బికినీ వేసుకుని వెళ్లాలన్నాడు. ఆ మాటకు వెంకయ్యకు కళ్లు బైర్లు కమ్మాయి... బీచ్ ఫెస్టివల్ గురించి మేం వూహించింది ఒకటైతే ఇక్కడ ఇంకోటి జరుగుతున్నట్లుగా వుంది. అసలేం జరుగుతుందిక్కడ... నాకు వెంటనే తెలియాలి అని మనసులో అనుకున్నాడు. అంతలో 'హాయ్ అంకుల్' అంటూ చెవికి రింగులు, కళ్లకు నల్లద్దాలు, ఒంటి మీద చెడ్డీ, బనీను వేసుకున్న యువకుడు వచ్చాడు. వెంకయ్య కోపంతో... ఎవర్రా నువ్వు... నన్ను అంకుల్ అంటున్నావు అని గదిమాడు. వెంటనే ఆ యువకుడు కళ్లద్దాలు తీసి... అంకుల్ నేను లోకేష్‌ను, చంద్రబాబు గారి అబ్బాయిని అని అన్నాడు. అప్పుడు వెంకయ్య ఆశ్చర్యంతో... మీకేం పోయే కాలం వచ్చిందిరా... మీరు చెప్పింది ఏంటి, ఇక్కడ చేస్తున్నదేంటి... అని అడిగాడు. దానికి లోకేష్... బీచ్‌ఫెస్టివల్ అంటే కర్పూరం వెలిగించి, గంగాహారతినిచ్చి, దండం పెట్టుకుని ప్రసాదాలు తినిపోవడం అనుకున్నారా... పక్కన గర్ల్‌ఫ్రెండ్, చేతిలో బీరు, దూరంగా ఓ టెంట్... ఇది అసలైన ఫెస్టివల్ అంటే... ఈ ఫెస్టివల్‌లో వున్న మజా మీకు చూపించడానికే పిలిపించామన్నాడు. అప్పుడే చంద్రబాబు, మంత్రులు కూడా నిక్కర్లు, బనియన్లలో వెస్ట్రన్ మ్యూజిక్‌లకు స్టెప్పులేస్తూ అక్కడకు వచ్చారు. నరేంద్ర మోడీ కోపంతో... సాగరతీరం పండుగ అంటే ఇదా... నాగసాధువులు, దిగంబర సన్యాసులు వస్తున్నారన్నావ్, వాళ్లేరి? అని ప్రశ్నించాడు. అదిగో అంటూ చంద్రబాబు ఒక వైపు చూపించాడు. అక్కడ ఫారిన్ అమ్మాయిలు ఒంటి మీద డ్రాయర్, బ్రాలతో అబ్బాయిలతో కలసి చిందులేస్తున్నారు. తర్వాత చంద్రబాబే... వీళ్లంతా దిగంబర సన్యాసులే కదా... వీరికి పెళ్లిళ్లు, సంసారాలు ఏమీ వుండవు... ఈ ఫెస్టివల్‌కు వీరిని ప్రత్యేకంగా ఆహ్వానించానన్నాడు. మరి ఆయా దేశాల నుండి మతాధిపతులు, పీఠాధిపతులు వస్తున్నారని చెప్పావ్... అని ప్రశ్నించాడు. వాళ్లు కూడా వచ్చారు... అదిగో అటు చూడండి అంటూ దక్షిణం వైపు చూపించాడు చంద్రబాబు. అక్కడన్నీ విస్కీ, బ్రాందీ కౌంటర్లు పెట్టి కొందరున్నారు. చంద్రబాబు వారిని చూపిస్తూ వారే విదేశాల నుండి మద్యం తెచ్చిన మతాధిపతులు అని వివరించాడు. మంగళంపల్లి బాలమురళీకృష్ణ భక్తి కచేరి అని చెప్పారు కదా అని రాజ్‌నాథ్‌సింగ్ అడిగాడు. మంగళంపల్లి భక్తి కచేరి కాదు... పాప్ సింగర్ మడోన్నా రక్తి కచేరి అని చెప్పాం... అదిగో అది కూడా వుందంటూ ఉత్తరం వైపు చూపించాడు లోకేష్‌బాబు. అక్కడ ఓ స్టేజ్ మీద మడోన్నా ఒంటి మీద ఒక్కో వస్త్రం విప్పుతూ పూనకం వచ్చినట్లు వూగుతూ పాడుతుంటే... అక్కడున్న జనం కూడా బట్టలు విప్పుకుంటూ చిందులేస్తున్నారు. అదంతా చూస్తున్న మోడీకి అప్పటికే అరికాల్లో మంట నెత్తికెక్కింది. మిగతా బీజేపీ నాయకులు కూడా ఆవేశంతో రగిలిపోతుంటే పరిస్థితిని అంతా గమనిస్తున్న వెంకయ్య... చంద్రబాబూ... బీచ్ ఫెస్టివల్ ఆపు... ఆపు... ఆపు... అంటూ కేకలేయసాగాడు. అలా ఆపు... ఆపు అంటూ కేకలేయడంతో ఆయన పక్కనే వున్న సతీమణి ఉషమ్మ ఉలిక్కిపడి లేచింది. పక్కనే చెంబులో వున్న నీళ్లను వెంకయ్య ముఖాన గట్టిగా కొట్టింది. ఆ దెబ్బకు వెంకయ్య... తత్తరపాటుతో లేచి కూర్చున్నాడు. పదినిముషాలకు తేరుకున్న ఆయన... అప్పటిదాకా బీచ్ ఫెస్టివల్ సీనంతా కల అని గ్రహించాడు. బీచ్ ఫెస్టివల్ ఇలానే ఉంటుందేమో... ఎందుకైనా మంచిది... చంద్రబాబుతో చెప్పి ఆపి వేయించాలనుకుంటూ మళ్లీ ముసుగుతన్ని నిద్రలోకి జారుకున్నాడు.

పుస్తక సమీక్ష

# శేషేంద్ర కవితా సౌరభం 'జనవంశమ్'

ఆధునిక మహాభారతానికి అనుబంధ కావ్యంగా శేషేంద్ర జనవంశాన్ని రచించారు. శేషేంద్ర కవిత్వం విలక్షణమైనది. పటిష్టమైనది. మనిషి గుండెలోతుల్లోకి వెళ్ళి ప్రశ్నిస్తుంది..కవి అంటే ఎవరో తెలియజెప్తుంది. ఒక్కమాటలో చెప్పాలంటే, కవికి జెండా-అజెండా శేషేంద్ర కవిత్వం.


కవిత్వానికి నిఖార్సయిన చిరునామా 'జనవంశమ్'. మనిషిని ఉగ్రూతలూగిస్తూ సాగే కవనం శేషేంద్ర కవిత్వం. జనవంశమ్ చదవడం.. ఒక దివ్యానుభూతి.

"ఈ నదులు ఈ కొండలు ఈ దేశం ఎవరిది. పనిచేసిన కూలీతో బ్రతుకుతున్న ప్రజలది. ఈ దేశపు వీధుల్లో నడిచే హక్కెవరిది..స్వేదబిందువుల దండలు వేసుకున్నవారిది'.. అంటారు శేషేంద్ర తన 'రుతు కాండ'లో. స్వేదం చిందించినవాడిపై తన మమకారాన్ని కురిపించారు.

శేషేంద్ర ఒక శ్రీశ్రీ, ఒక కృష్ణశాస్త్రి. అటు కావ్యవర్ణనలు చేసినా..ఇటు పేదల పక్షం వహించినా ఆయనకే చెల్లింది. శేషేంద్ర ఈ శతాబ్దపు మహాకవి. అందుకే వాస్తవాల్ని వెలయించి మనిషి బలహీనతల్ని సైతం ప్రశ్నించారు. గడ్డం వెనుక కోర్కెలు దాచుకోలేని సన్యాసిని నేనూ మనిషిని అంటారు. మనిషి బలహీనతల్ని నగ్నంగా చిత్రీకరించి ప్రశ్నించిన శేషేంద్ర విప్లవ కవితాయోధుడు.

'నీ నేత్రాల రేవుల్లో నౌకల్లా తేలుతున్నాయి స్వప్నాలు' అంటారు చిక్కని కవిత్వాన్ని పొందుపరుస్తూ. శేషేంద్ర అభివ్యక్తి ప్రత్యేకమైనది. సుందరమైనది. అదో కొత్తది. నిత్యనూతనమైనది.

'ఈ రుతువులో సింహాసనం మీద వున్న రాజు కంటే కొమ్మమీద కూర్చున్న కోకిలే మనకు ప్రభువంటారు. ఆయనే కొత్త పదాల సృష్టికర్త. 'కోకిలలు తీసుకొచ్చిన మిలియన్ల పూలమందులు కొమ్మల నిండా వందలు వందలు' అంటారు. ఒక్క పువ్వు చాలు ఉన్న స్మృతులన్నీ రద్దు చేయడానికి అంటారు. శోకాన్ని మరచిపోవడానికి కాలం తిథి వార నక్షత్ర సమేతంగా విచ్చేస్తున్నదని ఆహ్వానం పలుకుతాడు శేషేంద్ర.




**జనవంశమ్**
పేజీలు : 272 వెల : రూ.450/-
ప్రతులకు:
నవ తెలంగాణ, విశాలాంధ్ర అన్ని బ్రాంచీలు
మన తెలంగాణ, ప్రజాశక్తి అన్ని బ్రాంచీలు
నవోదయ బుక్‌హౌస్, హైదరాబాద్

కాలం చెట్లలో పూస్తుందంటారు. శేషేంద్ర భావుకత పరాకాష్టయై జనవంశమంతా పూలు పూయించింది. కాలాన్ని ఇంత గొప్పగా చెప్పిన కవి, చెప్పగలిగిన కవి తెలుగులో శేషేంద్ర ఒక్కరే! అనంతశూన్యంలో పరుగెత్తుతున్న మహా కాలవలయాన్ని ఏ బాహువు ఆపగలగదని ప్రశ్నిస్తారాయన.

'నేను నా దేశాన్ని' అంటూ దేశాన్ని ఎంతగానో, తనలాగే ప్రేమించిన కవి శేషేంద్ర. 'జన్మలో వంచనా శిల్పంలేని పక్షుల్లా పువ్వుల్లా బతుకు' అంటూ మానవలోకానికి ఓ సందేశం అందిస్తారు.

మనం నిత్యం వంచనా శిల్పులం. అబద్ధ అసంబద్ధ జాతకులం. నటనా ధురీణులం. వంచనా శిల్పం లేని పక్షుల్లా, వేకువ పువ్వుల్లా బ్రతకాల్సిన అవసరాన్ని నొక్కిచెప్తారు కవి.

నీకివ్వబడిన ఈ జీవితం స్వప్నాల్ని బాణాల్లా సంధించే ఇంద్రధనుస్సు అంటారు మహాకవి శేషేంద్ర. కలలు కనండి..ఆ కలల సాకారం కోసం శ్రమించండనే మహత్తరమైన సందేశాన్నిచ్చిన.. కోయిల మనస్సుడు శేషేంద్ర.

భ్రమరకాండలో 'ధరిత్రిని హలం దున్నితే అప్పుడు అవుతుంది ఒక దేశం. ధరిత్రిని కలం దున్నితే అప్పుడు అవుతుంది ఇతిహాసం. హలము కలమూ దున్నని ధరిత్రి ధరిత్రి కాదు..వట్టి మట్టి అంటారు. రైతు హలాన్ని ప్రేమించిన కవి శేషేంద్ర. హలం దున్నితేనే దేశం సుభిక్షమవుతుంది. అది నిజమైన దేశమవుతుందని, కలం ఎక్కుపెట్టిననాడే ఆ దేశం ఇతిహాసమవుతుందంటారాయన. అలా కలము హలమూ దున్నని ధరిత్రి దేశం కాదని తెగేసి చెప్తారాయన.

'నిన్ను కొలవడానికి ఒక్కోసారి సముద్రం కూడా అల్పం..ఒక్కోసారి బిందువు కూడా అధికం' అంటూ, ఎందుకు ఖైదీవై నిరీక్షిస్తావు. గదిలోనుంచి విశాల ప్రపంచంలోకి అడుగిడు. నీ సంకల్పంతో నీ కార్యశీలతతో సముద్రం కంటే ఎదగాల్సిన అవసరం వుంది..అంటారు. నువ్వు గదిలో కూర్చుంటే కుర్చీలు నవ్వుతాయి. గోడలు ప్రశ్నల్ని రువ్వుతాయి. అప్పుడు ఈ దేశంలోకి వసంతం అడుగుపెట్టదు. నాజూకుతనం మోయకు..కష్టించి పనిచెయ్..అంటూ హితైషి అవుతారు శేషేంద్ర. కష్టించి పనిచేసే వారిపట్ల తాను కలల్లోకి దిగుతానంటారాయన. శ్రమించేవారిపట్ల తన ఆర్తినీ ఈ పాదాల్లో చెప్తారాయన.

నేను జనంలో నడుస్తాను. దౌర్జన్యంగా ఒకరు మరొకర్ని కొడుతుంటే చూడలేను..అంటారు. పీడితుల పట్ల, అన్యాయం పట్ల ఎదురుతిరిగిన కవి శేషేంద్ర. కవిలోని ఈ అంశమే జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను కదిలించినట్లుంది. అందుకే శేషేంద్ర కవిత్వం ఆయన మానిఫెస్టో అయింది.

నాలో అగ్నిపర్వతం ఘర్ఘరధ్వని చేస్తూ వుంటుంది. అన్యాయాన్ని భస్మీపటలం చేస్తుంది. అన్యాయాన్ని ఎదిరించడం శేషేంద్ర జెండా అజెండా అయి కవిగా ఆయన మార్గం అన్యాయ ధిక్కరణమై మానవీయ సంపదనార్జించి అక్రమార్కుల గుండెల్లో నిద్రపోతానంటారు. అన్యాయం పట్ల శేషేంద్రకున్న కాఠిన్యం, మనుషుల పట్ల ప్రేమ, ఆయనకున్న అభిమానం ఎవరిలోనూ కనిపించవు. నేను ఈ శతాబ్దపు శిథిలాల్లోనుంచి లేస్తున్న కవిని అంటారు మహాకవి శేషేంద్ర. సామాన్యుల సుఖదు:ఖాలకు ఎంత శిరస్సు వంచుతాడో మనిషి.. అంత ఎదుగుతాడు అంటారాయన.

సామాన్యుల పట్ల, అణగార్లులపట్ల ఆయన ప్రేమ అనన్య సామాన్యం. మీ రక్తం పారబోసి నా కవిత్వాన్ని నింపుకోండి. తన కన్నుల్లో నీరు తెచ్చేవాడికంటే అన్యుల కన్నుల్లో నీరు తెచ్చేవాడే కవి..అంటూ కవిత్వానికి సరికొత్త నిర్వచనాన్నిచ్చారాయన.

ప్రజాకాండలో 'భయపడకు నీ చేతిలో రాళ్ళున్నాయి..రాకెట్లు లేకపోతేనేం' అంటారు. మనిషి తన కావ్యవస్తువుగా, మనిషి తన అజెండాగా..ఆ మనిషిని శక్తివంతుణ్ణి చేసే ఉపదేశాన్ని ప్రజాకాండలో ప్రస్ఫుటింపజేశారు.

'తెలుసా బిడ్డా!..ఈ దేశంలో రాజకీయ రుతువు రాగానే ఓట్ల డబ్బాలకు గర్భస్రావం జరుగుతుంది'.. అంటూ వర్తమాన రాజకీయ జిమ్మిక్కులను ఎండగడ్తారు శేషేంద్ర. ఇలా శేషేంద్ర స్పృశించని సన్నివేశం లేకపోవడం ఆయనలోని భావపుష్టికి నిదర్శనం.

శేషేంద్ర కవి తెలుగు కవులందరికీ ఆరాధనీయుడు. ఆయన కవిత్వం అమృతతుల్యం. జనవంశమ్ చదవడం ఒక భాగ్యం. ఆధునిక మహాభారతం, జనవంశమ్ నిత్య పారాయణ గ్రంథాలుగా దర్శనమిస్తాయి.

ఆ మహనీయుని కవిత్వం పఠించి పలవరించడమే శేషేంద్రకు నిజమైన నివాళి!...



- చిన్ని నారాయణరావు
94402 02942



## కావలి కబుర్లు

# ప్రజల గుండెల్లో కొలువైన ఎన్టీఆర్



**- బీదా మస్తాన్‌రావు**

పేద ప్రజల జీవితాలలో వెలుగులు నింపిన మహనీయుడు అన్న నందమూరి తారక రామారావు అని, ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రజలకు చేరువకావడం జరుగుతుందని రాష్ట్ర రాజధాని నిర్మాణ కమిటీ సభ్యులు, మాజీశాసనసభ్యులు బీద మస్తాన్‌రావు అన్నారు. కావలి మండలంలోని సర్వాయి పాలెంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగువారి ఆత్మగౌరవాన్ని ఢిల్లీ వీధులలో రెపరెపలాడించిన తెలుగుతేజం ఎన్టీఆర్ అని, బీసీలకు గుర్తింపునిచ్చి, వారి రాజకీయ ఎదుగుదలకు తోడ్పడిన మహానేత అన్నారు. ఎన్టీఆర్ బాటలోనే నడుస్తూ బడుగుల వుద్ధరణకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిత్యం శ్రమిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అలేఖ్య, ఎంపీపీ పర్రి మహేశ్వరి, జెడ్‌పీటీసీ పెంచలమ్మ, గుత్తికొండ కిషోర్ పాల్గొన్నారు.

## కందుకూరి చొరవతో స్వగ్రామానికి భౌతికకాయం

జీవనోపాది కోసం బారతదేశం నుండి సౌదీఅరేబియాకు వెళ్ళి గతనెల 29న అకాలమరణంపాలైన తుమ్మల శోభన్‌బాబు(44) భౌతికకాయం ఆయన స్వగ్రామం విడవలూరుకు చేరింది. ఆయన భౌతికకాయాన్ని స్వగ్రామంకు ఎలా తీసుకురావాలో బంధువులకు తెలియని పరిస్థితులలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కందుకూరి వెంకట సత్యనారాయణ స్పందించి కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు దృష్టికి తీసుకు వెళ్లగా సౌదీలోని భారతరాయబారి ద్వారా సౌదీ అరేబియా ప్రభుత్వంతో మాట్లాడి శోభన్ బాబు మృతదేహాన్ని విమానంలో హైదరాబాదుకు చేర్చేందుకు కృషి చేశారు. అక్కడ నుండి అంబులెన్స్‌లో ఆయన స్వగ్రామం విడవలూరుకు చేర్చారు.

## కాలధర్మం

# బట్రెడ్డి రమణారెడ్డి



నెల్లూరులోని మాగుంట లే అవుట్ రెసిడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, ప్రముఖ కాంట్రాక్టర్ బట్రెడ్డి వెంకటకృష్ణారెడ్డి తండ్రిగారైన బట్రెడ్డి రమణారెడ్డి ఈ నెల 11వ తేదీన తన స్వగ్రామమైన అనంతసాగరంలో కనుమూసారు. ఆయన వయసు 85సంవత్సరాలు. ఆయనకు ముగ్గురు కొడుకులు. వారిలో కృష్ణారెడ్డి పెద్దవారు. రైతు కుటుంబంలో పుట్టిన రమణారెడ్డి జీవితాంతం వ్యవసాయంలోనే గడిపారు. అనంతసాగరం మండలంలోని చుట్టుపక్కల గ్రామాల్లో ఆయనంటే మంచిపేరు. ఆయన మృతికి సంతాపం ప్రకటిస్తూ, వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

# ఉన్నం బసవయ్య



నెల్లూరు మునిసిపాలిటీలో కౌన్సిలర్‌గా పనిచేసి ఆదర్శ ప్రజాప్రతినిధిగా పేరుతెచ్చుకున్న ఉన్నం బసవయ్య(68) ఈ నెల 14వతేదీ రాత్రి 11.15లకు కన్ను మూశారు. సీనియర్ సిపిఎం నాయకుడైన ఉన్నం బసవయ్య నెల్లూరు మున్సిపాల్టీలో పలుసార్లు కౌన్సిలర్‌గా పనిచేశారు. ప్రజాసమస్యలపై ఎన్నో పోరాటాలు చేశారు. ముఖ్యంగా విజయమహల్ గేటు వద్ద బాక్స్‌టైపు బ్రిడ్జి సాధన కోసం ఆయన చేసిన పోరాటం విస్మరించలేనిది. ఎంతోకాలం పాటు విజయమహల్ గేటు వద్ద టెంటు వేసి ఈ బ్రిడ్జి కోసం ధర్నాలు చేసిన చరిత్ర ఆయనది. గత కొంతకాలంగా అనారోగ్య కారణంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఈయన 2012లో పినాకినీ దేహ సమర్పకుల సంస్థలో సభ్యులయ్యారు. ఈ నెల 15న ఆయన ఇంటి నుండి బసవయ్య పార్థివ దేహాన్ని నారాయణ వైద్యకళాశాల మానవ శరీర నిర్మాణ శాస్త్ర విభాగానికి తరలించారు. బసవయ్య మృతికి సంతాపం ప్రకటిస్తూ, వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.



**10వ వర్ధంతి**

మా కంటి వెలుగు, మా ఇంటి మహాలక్ష్మి
**శ్రీమతి అళహరి నాగరాజేశ్వరమ్మ గారు**
పరమపదించి 2016, నవంబర్ 18వ తేదీకి 10సంవత్సరాలు నిండుతాయి.
ఆమె తీపి జ్ఞాపకాలను సంస్మరించుకుంటూ కన్నీటి నివాళి అర్పిస్తున్నాం.
భర్త : **అళహరి సత్యనారాయణ**
మరియు **కుటుంబసభ్యులు**

# సాహిత్యమే సమాజానికి దిక్సూచి

## - జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్



సాహిత్యమే సమాజానికి దిక్సూచి అని, సమాజ పురోభివృద్ధికి దోహదపడేలా కవులు రచనలు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ సూచించారు. నెల్లూరు టౌన్‌హాలులో ఈనెల 12న పాతూరు మాణిక్యమ్మ రాష్ట్రస్థాయి స్మారక సాహిత్యపురస్కారం –2016 కార్యక్రమం జరిగింది. ప్రముఖ కవయిత్రి, ఈ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలైన పాతూరు అన్నపూర్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ సభలో పలువురు ప్రముఖులు, కవులు పాల్గొన్నారు. జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ మాట్లాడుతూ రచయితలను ప్రోత్సహించడంతో పాటు తల్లిరుణాన్ని తీర్చుకునేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పాతూరు అన్నపూర్ణను జేసి అభినందించారు. పూర్వకవుల రచనలను, సాహిత్యాన్ని నేటి ఆధునిక కవులు అధ్యయనం చేయాలని, వాటిని అర్థం చేసుకుని సమాజానికి ఉపకరించే మేలైన రచనలు చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు, సుప్రసిద్ధ కవి డా.శిఖామణి మాట్లాడుతూ, సాహిత్యం ప్రజలకు నిత్యావసర వస్తువని అన్నారు. నీటిప్రవాహంలో బండరాయి గుండరాయిగా ఎలా మారుతుందో అదేవిధంగా సమాజాన్ని కూడా శుద్ధిచేసేదే సాహిత్యమన్నారు. నెల్లూరు సాహితీవేత్తలతో తనకెంతో అనుబంధం వుందన్నారు. సింహపురిసీమలో కవికోకిల దువ్వూరు రామిరెడ్డి, డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి, మరుపూరు కోదండరామిరెడ్డి తదితర మహాకవులు కవులకు సాహిత్యస్ఫూర్తిని అందించారని, వారి స్ఫూర్తితో తాను అనేక కవితలు రచించానన్నారు. అనంతరం, రాష్ట్రస్థాయిలో నిర్వహించిన కవితల పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి పాతూరు మాణిక్యమ్మ పురస్కారంతో పాటు నగదు బహుమతులను అందజేశారు. విశాఖపట్నంకు చెందిన బండి సత్యనారాయణ, కైకలూరుకు చెందిన డాక్టర్ జ్యోత్నఫణిజ, రాజుపాళెంకు చెందిన సుంకర గోపాలయ్య ఈ పురస్కారాలను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో 'మల్లెతీగ' సంపాదకుడు కలిమిశ్రీ, శ్రీరామసాగర కవచం (ఒంగోలు), ప్రముఖ రచయిత్రి డాక్టర్ పెళ్ళకూరు జయప్రద, ప్రముఖ కవులు చిన్ని నారాయణరావు, ఆలూరి శిరోమణిశర్మ, గజల్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు. తొలుత జరిగిన కవి సమ్మేళనం అందరినీ ఆకట్టుకుంది. ఈ పురస్కార కార్యక్రమం సందర్భంగా ప్రముఖ కవులు గుర్రాల రమణయ్య, మోపూరు పెంచలనరసింహం, ములుగు లక్ష్మీమైథిలి, గాలి లలిత, తోట సులోచన, జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడు ఎస్ నరసింహమూర్తి, బందెల మోహన్‌లకు పురస్కారాలను అందజేశారు.

# చాచానెహ్రూ చెకుముకి అవార్డుల ప్రదానం



నెల్లూరులోని రత్నం ఛారిటబుల్ సొసైటి ఆధ్వర్యంలో నెహ్రూ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 13న డా॥ శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో జనవిజ్ఞాన వేదిక సహకారంతో 300మంది బాలబాలికలకు 'చెకుముకి ప్రతిభ' పరీక్షలు నిర్వహించినట్లు సొసైటి అధ్యక్షులు డా॥ రాచపాళెం రఘు తెలిపారు. ఈ పోటీల్లో గెలు పొందిన విద్యార్థులకు విక్రమ సింహపురి ఉపకులపతి ఆచార్య వి.వీరయ్య చేతుల మీదుగా 'జాతీయ చాచా నెహ్రూ చెకుముకి అవార్డు'లను ప్రదానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కెఎన్ఆర్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుండాల నరేంద్రబాబు, జనవిజ్ఞాన వేదిక అధ్యక్షకార్యదర్శులు పాకం బుజ్జయ్య, భాస్కరరావు తదితరులు పాల్గొన్నట్లు తెలిపారు.

# వృద్ధులకు ఇన్నర్‌వీల్ దుప్పట్లు



దుప్పట్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ రోహిణి, స్నేహలతారెడ్డి

గూడూరు ఇన్నర్‌వీల్ క్లబ్, ఆంధ్ర మహిళా మండలి ఆధ్వర్యంలో చిల్డ్రన్స్‌డే మరియు కార్తీక పౌర్ణమి సందర్భంగా సాయిబాబా మందిరంలో సోమవారం వృద్ధులకు దుప్పట్లు, పేదవారికి ఫ్యాంటు, షర్టులు పంపిణీ చేయడం జరిగిందని ఆంధ్ర మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి, ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు వై.స్నేహలతారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలం కాబట్టి వృద్ధులకు దుప్పట్లు ఇస్తే బాగుంటుందన్న ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. పై కార్యక్రమం డాక్టర్ రోహిణి దాతృత్వంతో జరిగిందని పేర్కొన్నారు.

# పేదలకు కష్టం... పెద్దలకు నష్టం

(మొదటి పేజీ తరువాయి)

ఏం జరుగుతుందో, దేశం ఏమైపోతుందో అర్థం కాని పరిస్థితి. ఆర్థిక మేధావులు సైతం రెండు వర్గాలుగా విడిపోయారు. ఎవరి బుర్రలో వున్న ఆలోచనలను వారు వినిపిస్తున్నారు. బ్లాక్ మనీ వెలికితీతకు ఇదే సరైన మార్గం అని కొందరు సమర్థిస్తుండగా, నల్ల కుబేరులు తమ బ్లాక్ మనీని సర్దేసుకుంటారని, పెద్దనోట్ల రద్దు వల్ల సన్న, చిన్న జనమే కష్టపడుతున్నారని, వారు పైసా పైసా కూడబెట్టి సంపాదించిన సొమ్ముకు భద్రత లేకుండా పోయిందని, చిల్లర కోసం సామాన్యులు పడరాని పాట్లు పడుతున్నారని, ఇది అసంబద్ధ నిర్ణయమని మరికొందరి ఆర్థిక నిపుణుల వాదన!

ఇక రాజకీయంగా చూస్తే పెద్దనోట్ల రద్దును బీజేపీతో పాటు ఒకట్రెండు మిత్రపక్షాలే సమర్థించాయి. బీజేపీలో సైతం దాదాపు 80శాతం మంది మోడీ నిర్ణయంపై ఉడికిపోతున్నారు. బ్లాక్ మనీ ఉండడంలో బీజేపీ నేతలేం మినహాయింపు కాదు కదా! కాకపోతే మోడీని ఏమీ పీకలేక వీళ్లంతా కుక్కిన పేనుల్లా మోడీ నిర్ణయాన్ని సమర్థిస్తున్నారు. పెద్దనోట్ల రద్దు హఠాత్ నిర్ణయంపై వ్యతిరేకంగా కాంగ్రెస్‌తో పాటు వామపక్షాలు, టీఎంసి, బిఎస్పీ, ఎస్పీ, ఆర్జేడీ, ఆప్ వంటి పార్టీలన్నీ జత కట్టాయి.

అయితే ప్రతిపక్షాలు ఎంత ఆందోళనలు చేసినా పెద్దనోట్ల రద్దుపై మోడీ వెనకడుగు వేయడంగాని, మినహాయింపులు ఇవ్వడం గాని ఉండకపోవచ్చు. ఈ విషయంలో అతని వైఖరి చాలా దృఢంగా వుంది. అంతే కాదు, డిసెంబర్ 30తో ఈ నోట్ల ప్రక్రియ ముగిసాక ఆయన బ్యాంక్ లాకర్‌లలో వుండే బంగారం నిల్వల మీద, బినామీ ఆస్తుల మీద కూడా చర్యలకు శ్రీకారం చుట్టనుండడంతో నల్లకుబేరుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.

పెద్దనోట్ల రద్దు అత్యంత సాహసోపేతమైన చర్య. నరేంద్ర మోడీ స్థానంలో ఆ పార్టీకి చెందిన ఇంకెవరు ప్రధానిగా వున్నా ఈ నిర్ణయం జరిగేది కాదు. కాంగ్రెస్ అధికారంలో ఉంటే ఎలాగూ జరగదు. దేశంలో పెనుమార్పు కోసం, నల్లధనాన్ని వెలుగులోకి తేవడం కోసం, రాజకీయ అవినీతిని, ప్రభుత్వ వ్యవస్థల్లో నెలకొన్న అవినీతిని అంతం చేయడం కోసం, ద్రవ్యోల్బణాన్ని నివారించడం కోసం, రూపాయి విలువ పెంచడం కోసం మోదీ సదుద్దేశ్యంతోనే ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇందులో సందేహం లేదు. దేశంలో మార్పు రావాలి అని ఎన్నో దశాబ్దాల నుండి కోరుకుంటున్నాం... ఆ మార్పుకు ఇప్పుడు అంకురార్పణ జరిగిందనే అనుకుందాం. మోడీ విజ్ఞప్తి చేసినట్లుగా దేశంలో మార్పు వస్తుందనే ఆశతో ప్రజలు కూడా తాత్కాలిక కష్టాలను భరించడానికి సిద్ధపడ్డారు. ఇక నల్ల కుబేరుల సంగతైతే చెప్పబల్లేదు. వారికి అన్ని విధాలా నష్టమే!

దేశంలో పెద్దనోట్ల రద్దుతో నెలకొన్నది ఆర్థిక విప్లవమే! ఇది మంచికి దారితీయొచ్చు, లేదా చెడును మిగల్చొచ్చు. అయితే ముందుగా జరిగే చెడుకు గ్యారంటీ ఉంది. కాని ఆ తర్వాత జరిగే మంచికి గ్యారంటీ లేదు. మోడీ ఆశిస్తున్న మంచి మార్పులు చోటుచేసుకుంటే మాత్రం దేశంలో దశాబ్దాల తరబడి నెలకొన్న దరిద్రపు జాడ్యాలను పూర్తిగా వదిలించుకున్నట్లే!

ముందుగా జరిగే నష్టాలను పరిశీలిస్తే... సన్న, చిన్న వ్యాపార వ్యవస్థలు దెబ్బతింటాయి. దేశంలో పెద్దపెద్ద వ్యాపార సంస్థలు తప్పితే చిన్న వ్యాపార సంస్థల లావాదేవీలన్నీ కూడా నగదు రూపంలోనే వుంటాయి. ఈ లావాదేవీలను ఆడిట్ చేయడం, పన్నుల కట్టడం వంటివి వుండవు. కొందరి బ్రతుకుదెరువు మార్గంగా ఈ వ్యాపారాలు జరుగుతుంటాయి. ఇప్పుడు ఈ వ్యాపారాలన్నీ దెబ్బతినడమో లేక తగ్గిపోవడమో జరిగి అనేక మంది రోడ్ల పాలవుతారు. ఉపాధి అవకాశాలు కోల్పోతారు. ప్రధానంగా రియల్ ఎస్టేట్ రంగం కుదేలవుతుంది. ఈ రంగం కోట్లాది మందికి ఉపాధి కల్పిస్తుంది. బ్లాక్ మనీ చెలామణి అయ్యేది కూడా రియల్ ఎస్టేట్‌లోనే! ఇటీవలకాలంలో దేశవ్యాప్తంగా విలాసవంతమైన వ్యాపారాలు జోరుగాసాగుతున్నాయంటే దానికి కారణం రియల్ఎస్టేట్ రంగమే! ఇప్పుడు ఇది కుప్పకూలడంతో దాని ప్రభావం ఎన్నో వ్యాపార రంగాలమీద పడుతోంది. అత్యధిక మంది ఉపాధి అవకాశాలు దెబ్బతింటాయి. దేశంలో ఇంతవరకు బ్యాంకులు కార్పొరేట్ కంపెనీలు, కాంట్రాక్టర్‌లు, పారిశ్రామిక వేత్తలు, బడా బాబులకే ఋణాలిచ్చేవి. సన్న చిన్న వ్యాపారులు, రైతులు ప్రైవేట్ ఫైనాన్స్‌ల మీదే ఆధారపడి వ్యాపారాలు, వ్యవసాయం చేసుకుంటున్నారు. పెద్దనోట్ల రద్దుతో ప్రైవేట్ ఫైనాన్స్ లావాదేవీలన్నీ ఆగిపోయినట్లే! పరిస్థితులు కుదుటపడే వరకు ఈ సన్న వ్యాపారులు, రైతులు ఋణాలు పొందేదెలా? తమ పనులు చేసుకునేదెలా? అన్నది ప్రశ్నగా మారుతోంది. అలాగే సామాన్య జనంకు ఆడిటింగ్, ఆదాయపన్ను వంటివి తెలియవు. ఆరుగాలం కష్టించి పది రూపాయలు సంపాదించుకుని స్థలాల రూపంలోనో, పొలాల రూపంలోనో కొని పెట్టి వుంటారు. వీటికి కూడా ఇబ్బంది లేదు. అలాకాక ఒకటిన్నర, రెండు రూపాయలకు వడ్డీలకు ఇచ్చి వుంటారు. ఇప్పుడు డబ్బులు తిరిగి ఇస్తున్నారు. మరి రైతులు ఆ డబ్బును తీసుకెళ్లి ఏం చేయాలి! ఇప్పటిదాకా వడ్డీ రూపంలో వస్తున్న ఆదాయం ఆగిపోయినట్లేగా? దేశంలో లక్షలాది మందికి నెలసరి జీవనాధారం ఈ వడ్డీలే! వాళ్లంతా కూడా రోడ్డున పడినట్లే! ఇవే కాకుండా వ్యాపార, వాణిజ్యాలన్నీ కూడా భారీగా తగ్గిపోతాయి.

మరి పెద్దనోట్ల రద్దుతో జరగబోయే మంచిని కూడా ఆలోచిద్దాం. ప్రభుత్వ శాఖల్లో అవినీతికి కళ్లెం పడుతుంది. తమ పనుల కోసం అధికారులకు లక్షల్లో లంచాలు ఇచ్చే పరిస్థితి ఉండదు. ఎందుకంటే పెద్దనోట్ల రద్దు తర్వాత పరిమిత కొత్త కరెన్సీ మాత్రమే మార్కెట్‌లోకి వస్తుంది. కాబట్టి కట్టల కొద్దీ డబ్బు లంచాల రూపంలో ఇవ్వలేరు. కాకపోతే వంద, రెండొందలు వంటి చిల్లర అవినీతిని ఆపలేకపోవచ్చు. ముఖ్యంగా రాజకీయ అవినీతి తగ్గుతుంది. ఇప్పటిదాకా ఒక రాజకీయ సభ పెట్టాలంటే 50లక్షల నుండి కోటి రూపాయల దాకా ఖర్చవుతుంది. ఇదంతా కూడా నల్లధనమే! ఇకముందు అలాంటి విచ్చలవిడి ఖర్చుండదు. ఇక ఎన్నికల్లో డబ్బున్న అభ్యర్థులు కాకుండా ప్రజల సమస్యల పట్ల అవగాహన, నిజాయితీ వున్న అభ్యర్థులకు అన్ని పార్టీలు కూడా టిక్కెట్లు ఇవ్వాల్సి వుంటుంది. ఇకముందు ఓట్ల కోసం కోట్లు వెదజల్లే పరిస్థితి ఉండదు. ఎవరు కూడా విచ్చలవిడిగా బ్యాంకుల నుండి ధనాన్ని తీసుకోలేరు. ఎందుకంటే ఖాతాల్లో వుండే తెల్లధనాన్ని ఎవరూ అంత ధైర్యంగా ఖర్చు చేయలేరు. ఇక నల్లధనం పూర్తిగా బయటకొస్తుంది. టాక్స్‌ల రూపంలో కేంద్ర ప్రభుత్వానికి లక్షల కోట్ల డబ్బు చేరుతుంది. ఈ డబ్బుతో దేశవ్యాప్తంగా మౌలిక సదుపాయాలను మెరుగు పరచవచ్చు. విద్య, వైద్య సంస్థలను ఆధునీకరించి పేద వాళ్లకు సైతం కార్పొరేట్ స్థాయి విద్య, వైద్యాన్ని అందించవచ్చు. నిరుపేదల జీవితాలకు భద్రత కల్పించవచ్చు. నిరుద్యోగులకు నెలవారీ నిరుద్యోగ భృతిని అందించవచ్చు. ముఖ్యంగా బ్యాంకులు ఆర్థికంగా పటిష్టమవుతాయి. అప్పుడు 50పైసలకే సన్న, చిన్న రైతులు, వ్యాపారులకు ఋణాలు ఇచ్చే అవకాశం వస్తుంది. వీరికి అధిక వడ్డీల బాధ తప్పుతుంది. ప్రధానంగా ద్రవ్యోల్బణం అదుపులోకి వస్తుంది. రూపాయి విలువ పెరుగుతుంది. నిత్యావసర వస్తువులతో పాటూ వివిధ సేవల ధరలు తగ్గుతాయి. పేదోడి జేబులో ఇంత వరకు కళావిహీనంగా వున్న రూపాయి ఇప్పుడు కళకళలాడుతుంది. భూముల ధరలు తగ్గుతాయి. పెట్టుబడి వ్యయం తగ్గినప్పుడు వస్తువుల ధరలు తగ్గుతాయి. నల్లధనం మూలంగా కొందరి గుప్పెట్లోకి వెళుతున్న భూములు, పేదలకు చేరువవుతాయి. పెరిగిన ధరలతో పేదోడికి పది అంకణాల ఇంటి స్థలం కొనే పరిస్థితి లేకుండా పోయింది. ఇప్పుడు స్థలాలు అందుబాటులో వుంటాయి. ప్రభుత్వ, రాజకీయ వ్యవస్థల్లో అవినీతి అంతమై పరిశ్రమలు, పెట్టుబడులు ఎక్కువవుతాయి. ఆటోమేటిక్‌గా ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. పెద్దనోట్ల రద్దుతో ప్రధానంగా నకిలీ కరెన్సీ పోతుంది. దొంగతనాలు, దోపిడీలు తగ్గుతాయి. విదేశాల్లో దాచిన నల్లడబ్బు బయట కొస్తుంది. ప్రభుత్వ టాక్స్‌లు, ఛార్జీలు తగ్గుతాయి. భారత రక్షణ రంగంతో పాటూ అన్ని వ్యవస్థలూ బలోపేతమవుతాయి. దేశ వనరులు ఏ కొద్దిమంది చేతుల్లోకో కాకుండా దేశ ప్రజలందరికీ పంచబడతాయి. పెద్దల విలాసాలు తగ్గిపోయి పేదల అవసరాలు కూడా తీరుతుంటాయి. ఇంకా దీని మూలంగా దేశానికి తెలియని ప్రయోజనాలు ఎన్నో ఉన్నాయి. అయితే అనుకున్నది అనుకున్నట్లుగా జరిగితేనే ఇవన్నీ నెరవేరుతాయి. పెద్దనోట్ల రద్దుతో జరిగే నష్టాన్ని ఎలాగూ ఆపలేము. జరగాల్సిన మంచి కోసం ఎదురుచూడడమే సగటు భారతీయుడి పని!

# బ్రేకింగ్ న్యూస్

(మొదటి పేజీ తరువాయి)

చెప్పినట్లవుతుంది. హైకోర్టు తీర్పుపై సుప్రీం కోర్టుకు వెళ్లినా కూడా అక్కడ కూడా ఇదే తీర్పును పునరుద్ధరిస్తే రాజకీయాల్లో కొంతవరకన్నా విలువలు నిలబడతాయి. ఎందుకంటే ఒక హత్యకేసులోనో, ఒక దొంగతనం కేసులోనో నిందితుడికి చచ్చేలోపు ఎప్పుడైనా శిక్ష వేయవచ్చు. కాని పార్టీలు ఫిరాయించిన ప్రజా ప్రతినిధులపై వారి పదవీ కాలం పూర్తయ్యేలోపు చర్య తీసుకో కుంటే, తర్వాత చర్యకు అర్థం ఉండదు.




# గడువుకంటే ముందే జరిగింది?

**● లీక్ వదంతులే కారణం!**

ప్రపంచ వ్యాప్తంగా సంచలనం రేకెత్తిస్తున్న భారత్‌లోని పెద్దనోట్ల రద్దు వ్యవహారంపై అనేక ఆసక్తికర కథనాలు వినిపిస్తున్నాయి. ఎవరికి తోచిన రీతిలో వారు కథలు అల్లుతున్నారు. బీజేపీ వాళ్ల అన్నీ సర్దుకున్నాకే పెద్దనోట్లను రద్దు చేసారని, దీనిపై ఆ పార్టీ నేతలకు ముందుగానే లీకయిందని ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయి. ఇంకొందరైతే సోషల్ మీడియాలో ఆర్బీఐ గవర్నర్ ఉర్జిత్‌పటేల్ అంతకుముందు రిలయన్స్ ఉద్యోగని, అంబానీకి ముందుగానే ఈ విషయాన్ని లీక్ చేశాడని, కాబట్టే రిలయన్స్ జియో సిమ్ ఆఫర్‌ను డిసెంబర్ వరకు ఇచ్చి... ఆ నష్టాన్ని తెల్లధనం రూపంలోకి మార్చుకోనున్నాడని ఒక ప్రచారం. దేశంలో రిలయన్స్‌తో సహా పలు కార్పొరేట్ కంపెనీల లావాదేవీలన్నీ కూడా నల్లధన రహిత లావాదేవీలే! వందకు ఐదు శాతం మాత్రమే వాళ్ల నాన్ అకౌంట్ క్యాష్ పెట్టుకుంటుంటారు. అది కూడా ప్రభుత్వ శాఖల్లో తమ పనులు పూర్తి చేసుకోవడానికి అధికారులకు ఇవ్వాల్సిన లంచాల కోసం! పెద్దనోట్ల రద్దుపై మీడియాలో గాని, సోషల్ మీడియాలోగాని వస్తున్న చాలా కథనాలు ఊహాజనితమైనవిగానే కనిపిస్తున్నాయి.

కాని పెద్దనోట్ల రద్దు ప్రకటన వాస్తవంగా నవంబర్‌లో జరిగి ఉండాల్సింది కాదని సమాచారం. 2017 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన రోజున ఆర్థికమంత్రి పెద్దనోట్ల రద్దును ప్రకటించే విధంగా ప్రధాని ముందస్తు ప్రణాళికను సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. ఆరోజుకు పూర్తి స్థాయిలో 500, 1000 కొత్త నోట్ల ముద్రణ పూర్తి కావడంతో పాటు చిల్లర సమస్య తలెత్తకుండా చేయాలన్నది ప్రణాళిక! అయితే ప్రభుత్వం చేపట్టిన 2వేల నోటు ముద్రణ విషయం లీకయ్యింది. ఈ నోటు గురించి సోషల్ మీడియాలో వచ్చేసింది. చాలామంది 2వేల నోటును చూసి కొత్తగా ప్రవేశ పెడుతున్న కరెన్సీ అనుకున్నారేగాని 500, వెయ్యి నోట్లను రద్దు చేస్తారనుకోలేదు. కాని కొంతమంది అధికార పార్టీ నాయకులే పెద్దనోట్ల రద్దు వాసనను పసిగట్టారు. అలాంటి లీకుల వల్లే ఏపి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లాంటివాళ్లు పెద్దనోట్లను రద్దు చేయాలని ప్రధానికి లేఖ వ్రాసి నిజాయితీ పరుల జాబితాలో చేరే ప్రయత్నం చేశారు. ఇలాంటి స్టేట్‌మెంట్ల వల్లే సబ్జెక్ట్ లీకయ్యిందని ప్రధానికి అనుమానం వచ్చింది. ఇక ఈ లీక్ అందరికీ తెలిస్తే నల్ల కుబేరులు జాగ్రత్తపడతారని, అనుకున్న లక్ష్యం నెరవేరదని భావించిన ప్రధాని ఇక ఏ మాత్రం ఆలస్యం చేయకుండా పెద్దనోట్లు రద్దు నిర్ణయాన్ని ప్రకటించారు. అనుకున్న గడువుకంటే ముందే ఈ నిర్ణయాన్ని ప్రకటించడంతో ప్రజలను అష్టకష్టాలు పెట్టాల్సి వస్తుంది. దీనికితోడు పాకిస్థాన్ వద్ద పెద్దఎత్తున నకిలీ కరెన్సీ ఉందన్న వార్తల నేపథ్యంలో, ఆ నకిలీ కరెన్సీని నిరోధించడానికి పెద్దనోట్ల రద్దుపై ఆరెస్సెస్ కూడా ఒత్తిడి తెచ్చిందని, అందుకే ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ఎలాంటి ముందస్తుచర్యలు చేపట్టకుండానే అత్యవసరంగా పెద్ద నోట్ల రద్దు జరిగిందని విశ్వసనీయ సమాచారం.

# ఎబివిపి దీక్షకు కోటంరెడ్డి మద్దతు



విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో జరుగుతున్న అక్రమాలను నిరసిస్తూ నెల్లూరు విఆర్‌సి సెంటర్‌లో ఎబివిపి విద్యార్థులు చేపట్టిన ఆమరణ నిరాహారదీక్ష శిబిరాన్ని ఈ నెల 16వ తేదీన నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సందర్శించారు. విద్యార్థులు చేస్తున్న దీక్షకు ఆయన మద్దతు తెలిపి మాట్లాడుతూ 1980లో తాను కూడా విఆర్ కళాశాల అధ్యక్షుడిగా ఇదే ప్రాంతంలో విద్యార్థుల సమస్యల పరిష్కారానికి 11రోజులు ఆమరణ నిరాహారదీక్ష చేసిన విషయాన్ని గుర్తుకు తెచ్చుకున్నారు. విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో పాలనా వ్యవహారాలు పూర్తిగా గాడి తప్పాయని, అనేక సమస్యలు విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నాయన్నారు. యూనివర్శిటీ గౌరవం రిజిస్ట్రార్ నిర్వాహకంతో వీధుల్లో పడిందని, విద్యార్థులు చేసే పోరాటాలకు తన సహకారం ఎప్పుడూ ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

# అపోలోలో సిఓపిడి దినోత్సవం



ప్రపంచ సిఓపిడి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 16వ తేదీన నెల్లూరులోని అపోలో స్పెషాలిటీ ఆసుపత్రిలో ఊపిరితిత్తులకు సోకే ప్రమాదకరమైన సిఓపిడి వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. పల్మనాలజీ స్పెషలిస్ట్ డాక్టర్ కరణం గౌరీనాథ్ మాట్లాడుతూ పొగ తాగే వాళ్లకు, పీల్చే వాళ్లకు, కట్టెపొయ్యిలు వాడేవారికి ఈ వ్యాధులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందన్నారు. ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులు వచ్చినప్పుడు వెంటనే పల్మనాలజీ వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ సదస్సులో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్వేతారెడ్డి, యూనిట్ హెడ్ నవీన్, పిఆర్ఓ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# దత్తపుత్రుడొచ్చాడు





ప్రపంచ క్రికెట్ దిగ్గజం, మాస్టర్‌బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ ఈ నెల 16వ తేదీన తన దత్తత గ్రామమైన గూడూరు మండలంలోని పుట్టంరాజుకండ్రిక గ్రామానికి విచ్చేశారు. రెండేళ్ళ క్రితం ఈ గ్రామాన్ని ద్తతత తీసుకున్న సచిన్, ఈ గ్రామనికొచ్చి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. రెండేళ్ళ తర్వాత ఆ పనుల పురోగతిని పరిశీలించడంతో పాటు కొన్ని పనుల ప్రారంభోత్సవానికి విచ్చేసారు. చెన్నై నుండి ప్రత్యేక హెలికాప్టర్‌లో 11.40 గంటలకు పి.ఆర్.కండ్రిగకు చేరుకున్న సచిన్‌కు గ్రామస్తులు పూలతో ఘన స్వాగతం పలికారు. 1.15కోట్ల ఖర్చుతో నిర్మించిన కమ్యూనిటి హాల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ గ్రామాభివృద్ధిలో పాలుపంచుకున్న అధికారులతో ముచ్చటించిన ఆయన, అభివృద్ధి పనులకు సంబంధించి ఇక్కడ ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. అలాగే అంగన్‌వాడీ భవనం, శ్మశానవాటికలకు కూడా ప్రారంభోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా సచిన్ ఆ గ్రామంలోని విజయమ్మ ఇంటికి వెళ్లి వారి కుటుంబసభ్యులతో ముచ్చటించారు. గ్రామంలోని పిల్లలతో సరదాగా ఫోటోలు దిగారు. విద్యార్థులకు క్రికెట్ కిట్‌లు పంపిణీ చేశారు. పి.ఆర్ కండ్రిగ పంచాయితీ పరిధిలోని నెర్నూరు, గొల్లపల్లి గ్రామాలను కూడా అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలోనూ సచిన్ ఎక్కువసేపు ప్రసంగించలేదు. ఆయన గ్రామస్తులతో ముఖాముఖీ చర్చకే ప్రాధాన్యతనిచ్చారు. సచిన్ పర్యటనలో ఎమ్మెల్యే పాశం సునీల్, ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, కలెక్టర్ ముత్యాలరాజు, జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ అహ్మద్, జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, పెంచలకోన దేవస్థానం ఛైర్మెన్ నానాజీ, ఆర్డీఓ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు. డిఎస్పీ బాదిపల్లి శ్రీనివాస్ బందోబస్తు చూసారు.

## నవనీతం స్కూల్‌లో...

పి.ఆర్. కండ్రిగ నుండి కృష్ణపట్నం పోర్టుకు చేరుకున్న సచిన్ సివిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నడుపుతున్న నవనీతం పాఠశాలను సందర్శించారు. స్కూల్‌లోని లైబ్రరీ, ల్యాబ్‌లను పరిశీలించారు. పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యనందిస్తున్న కృష్ణపట్నం పోర్టు యాజమాన్యాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో పోర్టు యం.డి చింతా శశిధర్, పి.ఆర్ హెడ్ జి.వేణుగోపాల్, పోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

ఉత్తరక్రియలు



బట్రెడ్డి రమణారెడ్డి
అనంతసాగరం, నెల్లూరుజిల్లా.

మా ఇంటి దైవం, మా తండ్రిగారైన
శ్రీ బట్రెడ్డి రమణారెడ్డి గారు
తే.11.11.2016ది,
శుక్రవారం స్వర్గస్తులైనారు.

వారి పవిత్ర ఆత్మకు
శాంతి కలగాలని
భగవంతుని ప్రార్థిస్తూ...

భార్య: బట్రెడ్డి రమణమ్మ

కుమారులు - కోడళ్లు
వెంకటకృష్ణారెడ్డి - అరుణ
సోమశేఖర్‌రెడ్డి - విజయ
శ్రీనివాసులురెడ్డి - ఉమాప్రియ

మనుమలు, మనుమరాళ్లు
సింధూరి - దినేష్
మహీధర్, జాహ్నవి,
కృష్ణ శ్రవణ్, కృష్ణ గీతమ్

ఉత్తరక్రియలు : తేది. 23.11.2016 బుధవారం అనంతసాగరంలోని మా స్వగృహమునందు జరుగును. కావున తెలియజేయడమైనది.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com